ప్రజాశక్తి
గురువారం 16 మే 2024   8 పేజీలు
గుంటూరు   పల్నాడు

ఆమె ఓటుపై గంపెడాశ

- మహిళల ఓట్లు తమకే అనుకూలమని టిడిపి, వైసిపి ధీమా
- ఘర్షణలు జరిగినా పోలింగ్ కొనసాగించిన యంత్రాంగం
- రీ పోలింగ్‌కు అవకాశమివ్వని ఎన్నికల కమిషన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పోలింగ్‌పై ప్రధాన పార్టీల్లో ఎవరికి వారే ధీమాగా ఉన్నారు. ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు 88 శాతం వరకు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావడంపై టిడిపి, వైసిపిల్లో కూడా ధీమా వ్యక్తం అవుతోంది. గుంటూరు జిల్లాలో కూడా 2019లో 72 శాతం పోలింగ్ జరగ్గా ఇప్పుడు 78.81 శాతం పోలింగ్ జరిగింది. జిల్లాలో మొత్తం 17,91,543 మంది ఓటర్లు ఉండగా 14,11,989 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని ఎన్నికల కమిషన్ బుధవారం తాజాగా విడుదల చేసిన గణాంకాలను బట్టి తెలుస్తోంది. ఓటు వేసిన వారిలో పురుషులు 6,85,984 మంది ఉండగా మహిళలు 7,25,943 మంది ఉన్నారు. పల్నాడు జిల్లాలో గత ఎన్నికలలో 80 శాతం పోలింగ్ జరగ్గా ఈసారి 85.65 శాతం ఓట్లుపోలయ్యాయి. మొత్తం 17,34,858 మంది ఓటర్లు ఉండగా 14,85, 909 ఓట్లుపోలయ్యాయి. వీరిలో 7,27,560 మంది పురుషులు, 8,81,485 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం పురుషుల కంటే మహిళల ఓట్ల శాతం గణనీయంగా పెరిగింది.

రెండు జిల్లాల్లో మహిళల ఓట్లు పోలవడంపై వైసిపి, టిడిపి ఇద్దరూ తమకే అనుకూలమని చెప్పుకుంటున్నాయి. సంక్షేమ పథకాలు ఎక్కువగా పొందిన మహిళలు పోలింగ్‌కు భారీగా తరలిరావడం తమకు సానుకూలంగా వైసిపి నాయకులు చెబుతున్నారు. అయితే మహిళల్లో వ్యతిరేకత వల్ల ఎక్కువమంది పోలింగ్‌కు వచ్చి టిడిపికి అనుకూలంగా ఓటు వేశారని ఆ పార్టీ నాయకులు ధీమాగా ఉన్నారు. రాజధాని తాడికొండ నియోజకవర్గంలోని తుళ్లూరు మండలంలో మహిళల ఓట్లు 90 శాతంకు పైగా పోలయ్యాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న రాజధాని రైతులు, మహిళల ఓట్లు తమకు ▶ 2లో

నియోజకవర్గాల వారీ పోలింగ్ వివరాలు... 2వ పేజీలో

పూర్తి వివరాలు మెయిన్‌లో

బస్సు వెనకసీట్లో కూర్చుని మృతి చెందిన తాత, అమ్మమ్మ, మనవరాలి అస్తికలు.. టిప్పర్ సీటులో డ్రైవర్ హరిసింగ్ అస్తికలు.. దావులూరి శ్రీనివాసరావు ఆస్తికలు

చిలకలూరిపేటలో ఘోరం

- టిప్పర్‌ను ఢీకొట్టిన ప్రైవేటు బస్సు - ఆరుగురు సజీవదహనం
- ఆయిల్ ట్యాంకర్ పగలడంతో వ్యాపించిన మంటలు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా, చిలకలూరిపేట

సొంతూరిపై మమకారం.. ఓటు వేయాలనే లక్ష్యంతో వారంతా స్వగ్రామాలకు వచ్చారు. తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. బంధుమిత్రులు, పిల్లలతో రెండు, మూడు రోజుల పాటు సరదాగా, సంతోషంగా గడిపారు. ఉద్యోగ విధులకు వెళ్లాలని తాము పనిచేసే ప్రాంతాలకు ఓ ప్రైవేటు టావెల్స్ బస్సులో మంగళవారం రాత్రి తిరుగు ప్రయాణమ య్యారు. మార్గ మధ్యలోనే మృత్యువు టిప్పర్ రూపంలో దూసుకొచ్చింది. బస్సు, డ్రైవర్, ట్రిప్పర్ డ్రైవర్‌తో సహా ఆరుగరి ప్రాణాలను బలిగొంది. బస్సులోని మిగతా ప్రయాణికులు కళ్లు తెరిచేలోపే అగ్ని కీలలు ఎగసి పడ్డాయి. ఈ ఘటనలో సుమారు 20 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది.

బాపట్ల జిల్లా చినగంజాం మండలం నీలయాపాలెం, చినగంజాం, గొనసపూడి గ్రామాలకు చెందిన 40 మందితో ప్రైవేటు బస్సు హైదరాబాదుకు వెళ్తుండగా బుధవారం వేకువజాము 2 గంటల సమయంలో అన్నభొట్లవారిపాలెం, పసుమర్రు గ్రామాల మధ్య ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టింది. రెండు వాహనాలకు నిప్పంటుకుని చిన్నగంజాం మండలం నీలాయపాలేనికి చెందిన భార్యాభర్తలు ఉప్పుగుండూరి కాశీబహ్మేశ్వరరావు (63), లక్ష్మి (55), వారి మనుమరాలు ముప్పరాజు ఖ్యాతి శ్రీసాయి (7), అదే మండలం గొనసపూడికి దావూలూరి శ్రీనివాసరావు (34), మధ్యప్రదేశ్‌కు చెందిన టిప్పర్ డ్రైవర్ హరిసింగ్, చీరాలకు చెందిన బస్సు డ్రైవర్ షేక్ మస్తాన్‌షరీఫ్ (45) సజీవ దహనమయ్యారు. 20 మంది గాయపడ్డారు.

పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న ఐజి సర్వశ్రేష్ట త్రిపాఠి

అల్లరి మూకలపై ఉక్కుపాదం : ఐజి

ప్రజాశక్తి - మాచర్ల

అల్లరి మూకలపై ఉక్కుపాదం మోపనున్నట్లు గుంటూరు రేంజి ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి హెచ్చరించారు. పట్టణంలో బుధవారం ఆయన పర్యటించి స్థానిక పరిస్థితులను పరిశీలించారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలు అదుపులోకి వస్తున్నాయన్నారు. జరిగిన హింసలో ఎవరున్నా ఉపేక్షించేది లేదన్నారు. ఇదిలా ఉండగా పల్నాడు జిల్లా ఎస్‌పి బిందుమాధవ్ రూరల్ సర్కిల్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎక్కడ ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టిగా బందోబస్తును ఎక్కడికక్కడ ఏర్పాటు చేశామని చెప్పారు. పోలింగ్‌కు ముందు, పోలింగ్ తరువాత జరిగిన ప్రతి ఘటనపైనా కేసులు నమోదైనట్లు తెలిపారు. ఆరెస్టుల ప్రక్రియ కూడా కొనసాగుతుందన్నారు. పల్నాడు జిల్లాలో 144వ సెక్షన్ నిరవధికంగా ఉంటుందని, పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

పోలీసు సిబ్బందిపై నిఘా?

మాచర్లలో పనిచేస్తున్న పలువురు పోలీసు సిబ్బందిపై ఉన్నాతాధికారులు నిఘా ఏర్పాటు చేసినట్లు తెలసింది. మాచర్లలో పని చేస్తున్న సిబ్బంది కాల్‌డేటా ఆధారంగా విచారణ జరుగుతున్నట్లు తెలిసింది. పోలింగ్‌కు ముంద, పోలింగ్ రోజున, పోలింగ్ తరువాత జరుగుతున్న పరిణమాలపై రాజకీయ పార్టీలకు పోలీసు కదలికలను చేరవేస్తున్నట్లు అనుమానించి ఏడుగురు సిబ్బంది కాల్‌డేటా ఆధారంగా విచారణ చేస్తున్నట్లు సమాచారం

హెల్మెట్ పెట్టుకోక.. ప్రాణం మీదికి..

రోడ్డు ప్రమాదంలో బీటెక్ చదివిన యువకుడు మృతి

ప్రజాశక్తి - నాదెండ్ల

హెల్మెట్ ఉన్నా పెట్టుకోని నిర్లక్ష్యం యువకుని ప్రాణాలను పొట్టనపెట్టుకుంది. రోడ్డు ప్రమాదంలో బీటెక్ చదివిన విద్యార్థి మృతి చెందిన సంఘటన మండలంలోని కనపర్రు బావి వద్ద బుధవారం జరిగింది. ఎస్ఐ బలరామిరెడ్డి వివరాల ప్రకారం.. నరసరావుపేట పట్టణంలోని సాయినగర్‌కు చెందిన కమ్మ ఈశ్వర్‌కృష్ణ ప్రసాద్ (23) బెంగళూరులో బీటెక్ పూర్తి చేశాడు. మంగళవారం చిలకలూరిపేటలో తన అమ్మమ్మ ఇంటి వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా నరసరావుపేట- చిలకలూరిపేట రహదారిలోని కనపర్తి భావి వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఈశ్వర్‌కృష్ణప్రసాద్ కింద పడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు ▶ 2లో

19న విస్తృతంగా సుందరయ్య వర్ధంతి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

ప్రజాశక్తి-తాడేపల్లి

దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభలు ఈనెల 19న అన్ని ప్రాంతాల్లోనూ నిర్వహించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. తాడేపల్లి అమరారెడ్డి భవన్‌లో సిపిఎం పట్టణ విస్తృత సమావేశం జి.సుబ్బారెడ్డి అధ్యక్షత బుధవారం నిర్వహించారు. రామారావు మాట్లాడుతూ సుందరయ్య తన జీవితాంతం పేదల అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీలో వచ్చిన అనేక ఒడిదుడుకులను తట్టుకుని సిపిఎం అభివృద్ధికి ▶ 2లో

రైల్వే ఉద్యోగిపై యువకుల దాడి

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లిలో రైల్వే ఉద్యోగిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన సంఘటన బుధవారం జరిగింది. ట్రాఫిక్ లో వెళుతు బైక్ పై ఎదురుగా వస్తున్న ముగ్గురు యువకులను కొంచెం పక్కకు వెళ్ళమని అన్నందుకు తలపై రేకుతో దాడి చేశారు.ఉద్యోగి తలకు రక్తం కారడంతో బైక్ పై ముగ్గురు పరారయ్యారు. ఆ ముగ్గురు యువకులు గంజాయి సేవించి ఉన్నారు. వీరు గంజాయి బ్యాచ్‌కు చెందిన వారని స్థానికుల సమాచారం.

అభ్యర్థులు పరిశీలించుకోవచ్చు : ఆర్ఓ

ప్రజాశక్తి -పొన్నూరు

సార్వత్రిక ఎన్నికలకు ఉపయోగించిన అన్ని ఈవీఎంలు వివి ప్యాట్ లు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని థర్మల్ సైన్స్ ల్యాబ్ బ్లాకులోని స్ట్రాంగ్ రూమ్ లో భద్ర పరిచామని పొన్నూరు అసెంబ్లీ సెగ్మెంట్ ఆర్వో లక్ష్మీ కుమారి బుధవారం తెలిపారు. సదరు స్ట్రాంగ్ రూమ్ భద్రత విషయంలో రాజకీయ పార్టీల వారికి, పోటీ చేసిన అభ్యర్థులకు భద్రత విషయంలో పరిశీలించదలచుకుంటే యూనివర్సిటీ లోని డైక్ మెన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నకు వచ్చి పరిశీలన జరుపుకొన వచ్చునని ఆర్ ఓ లక్ష్మీ కుమారి తెలియజేశారు.

మాట్లాడుతున్న మల్లేశ్వరరావు

కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాలి

అవగాహన ఆధ్వర్యంలో కుటుంబ దినతోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచం ఎంతగా మారుతున్నా మన కుటుంబ వ్యవస్థను కాపాడుకునే అవకాశం మన చేతుల్లోనే ఉందని, 'నా బలగమే నా బలం' అని గుర్తించిన వారికి కుటుంబమే స్వర్గ ధామంగా ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. బుధవారం అవగాహన కార్యాలయంలో అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంగీత విద్వాంసుడు విఎస్ఎన్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ మానవత్వ మనుగడ సాదనలో కుటుంబ వ్యవస్థ ప్రదానపాత్ర పోషిస్తుందని, నేటి నవతరానికి సామాజిక ఆర్థిక సంరక్షణకు, క్రమశిక్షణకు అవసరమైన విలువలను అందించటానికి కుటుంబమే ప్రధాన సాదనం అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కుటుంబాలను ప్రభావితం చేస్తున్న అంశాల పట్ల అందరికీ అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ 1993 మే 15వ తేదీన అంతర్జాతీయ కుటుంబ దినోత్సంగా ప్రకటించిందన్నారు. విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య మాట్లాడుతూ సమాజంలో కుటుంబాల పాత్రను గుర్తించటం, అవి ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, ఆరోగ్యపరమైన సవాళ్లకు పరిష్కారాలు వెతకటం, బందాలను బలోపేతం చేయటం ఎంతో అవసరం అని ఐక్యరాజ్యసమితి భావించి, కుటుంబ జీవనానికి, శ్రేయస్సుకి ప్రాధాన్యత ఇస్తూ ఏటా అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం నిర్వహించటానికి పిలుపు నిస్తుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాది ఎ.హరి, జనార్ధన రావు, అనిల్, కొండా శివరామిరెడ్డి పాల్గొన్నారు.

హెల్మెట్ పెట్టుకోక.. ప్రాణం మీదికి..

(మొదటి పేజీ తరువాయి)

తీసుకెళ్లారు. అయితే బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతునికి హెల్మెట్ ఉన్నా దాన్ని పెట్టుకోకుండా ద్విచక్ర వాహనం హ్యాండిల్‌కు తగిలించాడు. అదే పెట్టుకుని ఉంటే ప్రాణమీదికి వచ్చేది కాదేమో. మృతుని తండ్రి శివరాం ప్రసాద్ నరసరావుపేటలోని కృష్ణవేణి డిగ్రీ కాలేజీలో లెక్చరర్ కాగా తల్లి ఉపాధ్యాయిని. వీరి ఏకైక కుమారుడు ఈశ్వర్‌కృష్ణప్రసాద్ మృతితో వారు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

వ్యాధి నిరోధక శక్తి పెంచుకోవాలి

మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మీర్ హుస్సేన్

ప్రజాశక్తి -పొన్నూరు

సీజనల్ వ్యాధుల నివారణకు బలవర్ధకమైన తో పాటు, యాంటీబయాటిక్ మందులు వాడుకోవాలని పొన్నూరు సాంబ శివ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ మీర్ హుస్సేన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. జ్వరాలు, దగ్గు, జలుబు, తలనొప్పి రాకుండా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రత కారణంగా వడదెబ్బ వంటి వ్యాధులకు సరైన సమయంలో చికిత్స చేయించుకోవాలని, లేని ఎడల ప్రాణాంతకం అవుతుందని చెప్పారు . రోడ్డుమీద చల్లని, రంగు పానీయాలు తాగరాదు. రోడ్లమీద విక్రయించే కలుషిత ఆహారం తినకూడదని ఆయన పేర్కొన్నారు. మాంసాహారం తగ్గించాలని మద్యం సేవించకూడదని ఆయన వివరించారు. వడదెబ్బ తగలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల మధ్యకాలంలో ఆరు బయట అధిక శారీరక శ్రమతో కూడిన పని చేయ కూడదన్నారు. వీలైనంత ఎక్కువసార్లు నా సాంగ్ ఎక్కువ సార్లు మంచినీరు తాగాలి. ఎండలో తిరిగే సమయంలో చల్లని నిమ్మరసం, కొబ్బరినీరు, చల్లని మంచినీరు తాగాలని ఆయన పేర్కొన్నారు.

ప్రథమ చికిత్స..

వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ గల ప్రదేశానికి చేర్చాలి. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణం లేదా ఓరల్ రీహైడ్రేషన్ ద్రావణం(ఓ ఆర్ ఎస్) తాగించాలని డాక్టర్ మీర్ అహ్మద్ సూచించారు. వీలైనంత త్వరగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రూ.50 లక్షల పరిహారమివ్వాలి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పసుమర్రు గ్రామ సమీపంలో బుధవారం ప్రమాదం జరిగి ఆరుగురు సజీవ దహనమైన నేపథ్యంలో ఘటనా స్థలిని పరిశీలించిన సిపిఎం చిలకలూరిపేట పట్టణ కార్య దర్శి పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రహదారి విస్తరణ, నిర్మాణ పనులప్పుడు సరైన నిబంధనలు పాటించని కారణంగా వాటిల్లో ప్రమాదాలకు ప్రభుత్వం, కాంట్రాక్టర్లు సమాధానం చెప్పాలన్నారు. రోడ్డు పనులు జరుగుతున్నా సంకేతాలేమీ లేవన్నారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. ఇల్లు నిర్మించడంతోపాటు వారి పిల్లల చదువులు, ప్రభుత్వ ఉద్యోగాలు, ఇతర సహాయాన్నీ పూర్తిస్థాయిలో ప్రభుత్వం చేయాలని కోరారు. ఇలాంటి ప్రమాదాలు జరిగే అవకాశం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.

నియోజకవర్గాల వారీ పోలింగ్ వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైనవి	పురుషులు	మహిళలు	శాతం
తాడికొండ	2,07,615	1,81,603	88,318	93,285	87.47
మంగళగిరి	2,92,432	2,50,742	1,21,038	1,29,697	86.74
పొన్నూరు	2,27,133	1,93,019	93,464	99,552	84.98
తెనాలి	2,67,624	2,03,832	99,368	1,04,449	76.16
ప్రత్తిపాడు	2,67,888	2,21,090	1,07,699	1,13,375	82.53
గుంటూరుపశ్చిమ	2,78,158	1,85,065	89,844	95,211	66.53
గుంటూరుతూర్పు	2,50,691	1,76,652	86,255	90,386	70.47
పెదకూరపాడు	2,32,453	2,07,307	1,01,833	1,05,469	89.18
చిలకలూరిపేట	2,26,646	1,92,649	92,762	99,855	85.00
నర్సరావుపేట	2,32,778	1,88,701	92,040	96,646	81.06
సత్తెనపల్లి	2,42,047	2,10,050	1,03,116	1,07,381	86.97
వినుకొండ	2,64,559	2,36,036	1,16,722	1,19,263	89.22
గురజాల	2,73,971	2,30,945	1,12,704	1,18,219	84.30
మాచర్ల	2,62,404	2,19,763	1,08,333	1,11,420	83.75

ఆమె ఓటుపై గంపెడాశ

(మొదటి పేజీ తరువాయి)

దక్కుతాయని తద్వారా తమకు భారీగా వస్తాయని ఆశిస్తున్నట్టు టిడిపి నాయకులు తెలిపారు.

పోలింగ్ రోజున టిడిపి, వైసిపి కేడర్‌ను ఉత్సాహపరిచేందుకు ప్రత్యర్థి పార్టీ ఓడిపోతుందంటూ ప్రత్యేక సర్వేల పేరుతో పోస్టింగ్‌లు పెట్టి రకరకాల ఎత్తుగడలు అవలంభించారు. పోలింగ్ రోజున పల్నాడు జిల్లా మాచర్ల, వినుకొండ, నరసరావుపేట, పెదకూర పాడు, సత్తెనపల్లి, గురజాల తదితర నియోజవర్గాల్లో ఘర్షణలు భారీగా జరిగినా పోలింగ్ మాత్రం ఎక్కడా ఆగలేదు. దాదాపు 8 కేంద్రాల్లో ఈవీఎంలు ధ్వంసం చేసినా ప్రత్యామ్నాయ ఈవీఎంలతో పోలింగ్ కొనసాగించారు. రీ పోలింగ్‌కు అవకాశం లేకుండా ఎన్నికల కమిషన్ ఎప్పటికపుడు అధికారులను అప్రమత్తం చేసింది. పల్నాడు, గుంటూరు జిల్లాల్లో టిడిపి, వైసిపి హోరాహోరీగా తలపడ్డాయి. పోలింగ్ శాతం భారీగా పెరగడం, కొత్త ఓట్లు యువత ఉత్సాహంగా పాల్గొనడం, మహిళలు కూడా భారీగా పోలింగ్‌లో పాల్గొనడంపై ఎవరికి వారు తమదే గెలుపంటున్నారు. నియోజకవర్గాల వారీగా అంచనాలు వేస్తున్నారు. ఇందులో మహిళల పాత్ర కీలకం కానుంది.

19న విస్తృతంగా సుందరయ్య వర్ధంతి

(మొదటి పేజీ తరువాయి)

పాటుపడ్డారన్నారు. సంతానం కలిగితే ఎక్కడ ప్రజాసేవకు ఆటంకం కలుగుతుందోనని తాను కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుని పేదల పక్షాన నిలిచారన్నారు. సుందరయ్య పార్లమెంట్ సభ్యునిగా, శాసనసభ్యునిగా ఉండి ప్రజా సమస్యలను చట్టసభల్లో ఎలుగెత్తి చాటారన్నారు. ప్రథమ పార్లమెంట్‌లో ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, ప్రతిపక్ష నాయకునిగా సుందరయ్య ఉన్న సంగతిని గుర్తు చేశారు. పార్లమెంట్‌లో సుందరయ్య ప్రసంగం చేస్తుంటే ప్రధానిగా ఉన్న నెహ్రూ ఆసక్తిగా ఆలకించడమే కాకుండా ఆయన చెప్పిన అంశాలను నోట్ చేసుకుని సమాధానం చెప్పేవారన్నారు. గన్నవరం నియోజకవర్గం నుంచి 15 ఏళ్లు ఎమ్మెల్యేగా సుందరయ్య ప్రాతినిధ్యం వహించారని చెప్పారు. నేడు అసెంబ్లీ, పార్లమెంట్ నిర్వహణను చూస్తుంటే ప్రజాస్వామ్యవాదులకు, అభ్యుదయవాదులకు బాధ కలుగుతోందన్నారు. ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వ్యక్తిగత దూషణలతోనే సరిపెడుతున్నారని విమర్శించారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక కులం, మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతోందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయన్నారు. సుందరయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మించాలని, పాలకవర్గ పార్టీలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి, పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డబ్బు పంపిణీపై చర్చ

గెలుపుపై ప్రధాన పార్టీల ధీమా

ప్రజాశక్తి-తాడేపల్లి

ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు డబ్బులు వెదజల్లారు. ఇంత పెద్దఎత్తున డబ్బులు విరజిమ్మి ఓట్లు కొనుగోలు చేయడం తామెప్పుడూ చూడలేదని తలపండిన వృద్ధులు అంటున్నారు. ఒక సామాజిక వర్గాన్ని టార్గెట్‌గా చేసుకుని ఇంట్లో ఎన్ని ఓట్లు ఉన్నా ఆ ఓట్లు తమకే పడాలని ఒక్కో ఇంటికి లక్ష రూపాయలు ఇచ్చిన సంఘటన నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది. కొన్ని చోట్ల రూ.4 వేలు, రూ.3 వేలు పంపిణీ చేసిన ప్రధాన పార్టీలు అత్యధిక ఓట్లు ఉన్న సామాజిక వర్గానికి మాత్రం ఓటుకు రూ.10 వేలు చొప్పున పంపిణీ చేశారని చర్చ నడుస్తుంది. ఇంత చేసినా ఎవరు గెలుస్తారనేది చెప్పలేకపోతున్నారు. తాము గెలుస్తామంటే తాము గెలుస్తామని పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా లోపల భయం వెంటాడుతూనే ఉంది. లక్షల రూపాయలు డబ్బులు తీసుకున్నా తమకు నచ్చిన వారికే ఓటు వేస్తారనే భయం ఇరుపార్టీల్లో ఉంది. ఏ సెంటర్‌లో నలుగురు గుమికూడినా దీనిపైనే చర్చ జరుగుతుంది.

వెంకటపాలెంలో రైతుల దీక్షలు

రైతు దీక్షలు..1611వ రోజు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి నిర్మాణంతోనే రాష్ట్ర ప్రతిష్ట ఇనుమడిస్తుందని రైతులు,రైతు కూలీలు,మహిళలు పునర్ఘాటించారు.రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలంటూ చేస్తున్న ఆందోళనలు బుధవారంతో 1611 వ రోజుకు చేరాయి. తుళ్లూరు, వెంకటపాలెం,

కొవ్వొత్తులు వెలిగించి నినాదాలు చేస్తున్న మహిళా రైతులు, చిన్నారులు

నెక్కల్లు, అనంతవరం తదితర గ్రామాల్లో దీక్షలు సాగాయి. ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఐదేళ్లకు ప్రభుత్వాలు మారతాయని, ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ప్రజల అభీష్టాన్ని, ఆకాంక్షలను గుర్తెరిగి పాలన సాగించాలని రైతులు అన్నారు.జగన్ మాత్రం అందుకు విరుద్ధంగా పాలన చేశారని విమర్శించారు. అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించి 'బిల్డ్ అమరావతి,సేవ్ ఆంధ్ర ప్రదేశ్ 'అంటూ నినాదాలు చేశారు.

బాలికల వసతి గృహంలో ప్రవేశాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని కమ్మజన సేవా సమితి బాలికల వసతి గృహంలో 2024-25 సంవత్సరానికి ప్రవేశం కోసం దరఖాస్తులను కోరుతున్నట్టు సమితి అధ్యక్షులు సామినేని కోటేశ్వరరావు తెలిపారు. సమితి కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యను అభ్యసించిన వారు,. ప్రతిభ, పేదరి కం ఆధారంగా ప్రవేశం కల్పిస్తామన్నారు. దేశంలో ఎక్కడ నుంచి అయినా స్థానికంగా చదువుకునే విద్యార్థులకు ప్రవేశం ఉంటుందన్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి 25వ తేదీ మధ్య దర ఖాస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. 27న దర ఖాస్తులను సమితి కార్యాలయంలో అంద జేయాలన్నారు. 31న పరిశీలన, ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికైన వారు జూన్ నుంచి 5వ తేదీలోగా రిపోర్టు చేయాలన్నారు. నామమాత్రం ఫీజులతో ప్రవేశం ఉంటుందన్నారు. గోరంట్ల పున్నయ్య చౌదరి మాట్లాడుతూ రూ.50 లక్షలతో ప్రతియేటా పేద విద్యార్థులకు స్కాలర్ షిపులు ఇస్తామన్నారు.

పంట వ్యర్థాలకు నిప్పు .. భూసారానికి ముప్పు..

భూమిలో అంతరించిపోతున్న సూక్ష్మ పోషకాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పంట పొలాల్లో ఖరీఫ్ రబీలో ప్రధానంగా ప్రత్తి,మిర్చి వంటి వాణిజ్య పంటలతో పాటు వరి, మొక్కజొన్న, జొన్నతో పాటు శనగ, మినుము, పెసర, కంది వంటి అపరాల పంటలు పల్నాడు జిల్లా రైతులు సాగు చేస్తారు.ఆయా పం టల నూర్పిడి అనంతరం వ్యర్దాలను ఎక్కువ శాతం మంది రైతులు నిప్పు పెడుతున్నారు. ప్రధానంగా రబీలో సాగు చేసిన మొక్కజొన్న నూర్పిడి అనంతరం గింజలను పొలం నుండి తరలించాక కండెలు మొక్కజొన్న మోడులకు నిప్పు పెడుతున్నారు. అలా చేయడం వలన పొలంలో వ్యర్దాలు తొలగిపోతాయని భావిస్తున్న రైతులు భూసారానికి ముప్పు వాటిల్లుతుందని విషయాన్ని గ్రహించలేక పోతున్నారు. జాతీయ విపత్తుల జాబితాలో పంట వ్యర్దాలకు నిప్పు పెట్టడం చేర్చారంటే అలా చేయడం వలన భూసారానికి ఎంత చేటు జరుగుతుందో తెలుసుకోవాలని శాస్త్ర వేత్తలు సూచిస్తున్నారు.

పంట కోతల అనంతరం నుర్పిళ్ళు అయిన తర్వాత మిగిలిన వ్యర్దాలకు నిప్పు పెడితే భూమిలో ఉండే సేంద్రియ కర్బనంతో పాటు నత్రజని, పొటాషియం, గంధకం వంటి పోషకాలు కూడా నశించి పోతాయి. పంటకాలం పూర్తయ్యాక వ్యర్ధాలను భూమిలో కలియ దున్నడం వలన భూమికి ప్రయోజనం కలుగుతుందని పంటకు ఆశించిన మేర సూక్ష్మ పోషకాలు సక్రమంగా అందుతాయనే విషయం రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. గతంలో పంటను కల్లాలు చేసి ఒక చోట చేర్చి నూర్పిడి చేసేవారు. వ్యవసాయ రంగంలో పెరిగిన కూలీల కొరత పెరిగిన యాంత్రికీకరణ ద్వారా రైతులు పనులు సాగిస్తూ పనులు చక్కబెట్టుకోవడంతో వ్యర్దాలకు నిప్పు పెడుతున్నారు. అలా చేయడంతో భూమిలో ఒక సెం.మీ లోతు వరకు భూమి పొరల్లో మట్టి అధిక ఉష్ణోగ్రతకు గురై ఫలితంగా భూసారానికి అత్యంత కీలకమైన సూక్ష్మజీవరాశి సిలింద్రాలు సంతతి నశించి పోతున్నాయి. అంతే కాకుండా భూమిలో సేంద్రియ లక్షణం పూర్తిగా నాశనం అవుతుంది.

మొక్కజొన్న నూర్పిడి అనంతరం మోడులు తగులబెట్టిన రైతులు

మంటలు వ్యాపించి తగులబడ్డ రోడ్డు వెంబడి చెట్లు

ఇలా చేయడం మంచిది...

పంట వ్యర్ధాలను పశువుల పేడ మూత్రాన్ని కలిపి సూక్ష్మజీవుల తోడ్పాటుతో కొన్నపెట్టి కంపోస్ట్ ఎరువు తయారు చేసుకోవచ్చు. పొలంలోనే రెండు మీటర్ల వెడల్పు ఒక మీటర్ లోతు తగినంత లోతు గొయ్యి తవ్వి అందులో పంట వ్యర్థాలను చెత్త పేడ నీరు పసు ముత్రాలను చల్లి తిరిగి గడ్డి ఇతర వ్యర్థాలను పొరలు పొరలుగా వేయాలి. లోపలికి గాలి చొరబడకుండా ఎత్తుగా మట్టి వేసి కప్పి ఉంచడం ద్వారా 3 నెలల అనంతరం సారవంతమైన కం పోస్ట్ ఎరువు తయారవుతుంది. కానీ ఎవరు ఈ దిశగా దృష్టి సారించడం లేదు.

అవగాహన కల్పిస్తున్నాం

డాక్టర్ గురువుగారి రమేష్, వ్యవసాయ శాస్త్ర వేత్త

పంట పొలాల్లో వ్యర్థాలు నిప్పు పెడితే భూసారంలో పూర్తిగా మార్పులు జరుగు తాయి. తర్వాత పంటలపై ప్రభావం చూపుతుంది. వాతావరణ కాలుష్యంతో పర్యా వరణానికి చేటు వాటిల్లుతుంది. డీ కంపోజర్ పొలంలో చల్లితే వారం రోజుల వ్యర్థాలు కుళ్ళి పోయి భూసారం పెరుగుతుంది. పల్నాడు జిల్లాలో కొన్ని గ్రామాలలో ఇలా చేయ డం వలన ఫలితాలు వస్తున్నాయని రైతులు తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా భూసారం పెంచుకోవడంపై రైతులు అవగాహన కల్పిస్తున్నాం.

గుంటూరు-కర్నూలు హైవేలో ఫిరంగిపురం మండలం రేపూడిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాజేంద్ర, దుర్గాప్రాద్ మృతదేహాలు, గోసాల రాజేంద్ర డ ఫైల్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి- మేడికొండూరు

ఫిరంగిపురం మండలంలోని రేపూడి సమీపంలోని టీవీఎస్ షోరూమ్ సమీపంలో. లారీ ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు కర్నూలు హైవేలో ఫిరంగిపురం మండలం రేపూడిలోని టీవీఎస్ పైనీర్ షోరూమ్ ఎదురుగా గుంటూరు నుండి నరసరావుపేట వైపు వెళుతున్న లారీ, స్కూటీని ఢీ కొట్టింది. ఈ ఘటనలో స్కూటీపై వెళుతున్న ఇద్దరు లారీ కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు.మృతులు గొల్లపాలెంకు చెందిన గోసాల రాజేంద్ర (లూర్దురాజు) (35), రేపూడికి చెందిన మద్దు దుర్గాప్రసాద్(37). ప్రమాద సంఘటన విషయం తెలుసుకున్న ఫిరంగిపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజేంద్ర, దుర్గాప్రసాద్‌లు పెయింటింగ్ పనిచేసి జీవనం సాగిస్తుంటారు. ఈ ప్రమాద సమాచారం తెలుసుకున్న తాడికొండ నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత సంఘటనా సంఘటనా స్థలానికి వెళ్లారు.. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారికి తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. మృతులు ఇద్దరికీ భార్యాపిల్లలు ఉన్నారు.

ఓటమి భయంతో దాడులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రాష్ట్ర భవిష్యత్ కోసం జనం కసితో ఓటు వేశారని,ఈసారి ఊహించని ఫలితాలు చూడబోతున్నామని టిడిపి ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు భార్య వెంకట కుమారి అన్నారు. బుధవారం స్థానిక పండరీపురంలోని తన నివాసానికి తనను కలిసేందుకు వచ్చిన పార్టీ శ్రేణులతో ఆమె మాట్లాడారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాలనే కసి, ప్రతీ ఓటర్ లోనూ కనిపించిందన్నారు.ఓటమి భయంతో వైసిపి నేతలు హింసకు కాలుదువ్వినా టిడిపి శ్రేణులు సమయ స్ఫూర్తితో వ్యవహరించారని అన్నారు.

నేలబావిలో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - క్రోసూరు

మండలంలోని విప్పర్ల రోడ్డు పక్కనున్న నేల బావిలో పడి చిలక దీన రాజు (30) అనే యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం ఈ నెల 13 వ తేదీన దీనరాజు, ఆమె భార్య గొడవ పడ్డారు. దీంతో, అతను ఎవరికి చెప్పకుండా తాగిన మత్తులో పల్లె పక్కనే ఉన్న నేల బావిలో దూకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గత మూడు రోజుల నుంచి అతని బంధువులు అతని కోసం వెతికారు. బుధవారం ఉదయం బహిర్భుకి వెళ్ళిన వారు ఈ బావి వైపు చూడటంతో మృతదేహం పైకి తేలుతుండటం గమనించారు. అక్కడికి వెళ్లిన గ్రామస్తులు ఈ విష యాన్ని అతని కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతుడు దీనరాజుకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. ప్రస్తుతం అతని భార్య నాలుగు నెలల గర్భిణి

గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రకాశం బ్యారేజ్ 6వ పిల్లర్ వద్ద కృష్ణానదిలో గుర్తు తెలి యని మృత దేహం లభ్యమైంది. ఈ వ్యక్తి మంగళ వారం సాయంత్రం ప్రకాశం బ్యారేజ్ మీద నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆలయంలో చోరీ

ప్రజాశక్తి-తాడేపల్లి

నెహ్రూ బొమ్మ సెంటర్‌లోని సిద్ధి విఘ్నేశ్వర మణికంఠ దేవస్థానంలో దొంగతనం జరిగింది. దొంగలు గుడి ముందు భాగం వరండాలో ఉన్న టేబుల్ సొరుగు పగులగొట్టి సుమారు రూ.70 వేలు విలువ చేసే వెండిమాల, ఎనిమిది ఇత్తడి కుందులు ఎత్తుకెళ్లారు. పక్కనే ఉన్న హుండీ పగలగొట్టడానికి దొంగలు విఫలయత్నం చేశారు. దీనిపై ఆల చైర్మన్ బండి త్రినాథ్‌రెడ్డి తాడేపల్లి పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. పోలీసులు బుధవారం సంఘటన ప్రాంతాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మీడియాతో మాట్లాడుతున్న పద్మశాలియ సాధికారిక సమితి నాయకులు

ఓటర్లకు ధన్యవాదాలు

టిడిపి పద్మశాలియ సాధికారిక సమితి

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి నియోజకవర్గంలో 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి నారా లోకేష్ విజయాన్ని కాంక్షిస్తూ పనిచేసిన టిడిపి పద్మశాలియ నాయకులు, కార్యకర్తలకు, ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లకు జిల్లా దేశం పార్టీ పద్మశాలియ సాధికారిక సమితి నాయకులు జొన్నాదుల బాలకృష్ణ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం రాత్రి రెండు రామ మందిరాల వద్ద బాలకృష్ణ మాట్లాడారు. నారా లోకేష్, ఎంపిఅభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ పద్మశాలి నాయకులు, కార్యకర్తలు పని చేశారన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మోహనరావు

వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-పెదనందిపాడు

శాఖా గ్రంధాలయం, పెదనందిపాడు నందు ఈరోజు వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఎస్టియు రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు ప్రారంభించారు. సమావేశానికి గ్రంథాలయ నిర్వహకురాలు పి.సుభాషిని అధ్యక్షత వహించారు. మోహన్ రావు మాట్లాడుతూ కథలు, కథనాలు, సృజనాత్మక కృత్యాలు నిర్వహించడం వలన విద్యార్థులలో వలన సృజనాత్మకత, నైతిక విలువలు పెరుగుతాయని అన్నారు. విద్యార్థులు ఈ వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుభాషిని మాట్లాడుతూ జూన్ 7వ తేదీ వరకు ఈ శిక్షణా శిబిరం నిర్వహిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో మంజుల, బుజ్జి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్రిక్తలను తగ్గించడానికి ప్రధాన పార్టీలు బాధ్యత తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - క్రోసూరు

ఎన్నికల సందర్భంగా పెదకూరపాడు నియోజకవర్గంలోని గ్రామాల్లో ఏర్పడిన ఉద్రిక్తత పరిస్థితులను చల్లార్చడానికి ప్రధాన రాజకీయ పార్టీలు బాధ్యత తీసుకోవాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు కోరారు. ఈ మేరకు స్థానిక ఆమంచి భవన్‌లో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. పోలింగ్ రోజైన గత సోమవారం నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో వైసిపి, టిడిపి శ్రేణులు పరస్పర దాడులు చేసుకోవడం బాధాకరమని అన్నారు. ఆయా గ్రామాల్లో ఉద్రిక్తత పరిస్థితులు ఇంకా కొనసాగుతున్నాయని, వాటిని నియంత్రించకపోతే భవిష్యత్తులో వివిధ సామాజిక తరగతుల మధ్య వివాదాలుగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో ఆయా పార్టీల అభ్యర్థులు బాధ్యత తీసుకుని వివాదాల్లేకుండా చూడాలన్నారు. ప్రజలు కూడా ఆలోచించి ఉద్రిక్తతలకు లోనవ్వకుండా సహనంతో వ్యవహరించాలని కోరారు. ఉద్రిక్త పరిస్థితులున్న గ్రామాల్లో పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఎన్నికల సందర్భంగా బైండోవర్ చేసిన వారితో మాట్లాడి శాంతి కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. ఉద్రిక్త పరిస్థితులకు ఒక రకంగా మద్యం కారణమని, గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్ముతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. సత్వరమే మద్యం విక్రయాలను నియంత్రించాలని, కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

పులివర్తి నానిపై దాడికి ఖండన

ప్రజాశక్తి - బెల్లంకొండ

ఎన్‌డిఎ కూటమి తరుపున చంద్రగిరి నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిపై వైసిపి నాయకుల దాడి దారుణమని టిడిపి నాయకులు వెన్న సీతారామిరెడ్డి బుధవారం ఖండించారు. పోలింగ్ సందర్భంగా జనం టిడిపికి ఎక్కువగా ఓట్లేయడాన్ని జీర్ణించుకోలేకే వైసిపికి చెందిన గుండాలు దాడులకు తెగబడుతున్నారని విమర్శించారు. వైసిపి తన వైఖరి మార్చుకోవాలని హితవుపలికారు.

రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ ఉందా? : పుల్లారావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ అసలు ఉందా? లేదా? అని ఎన్‌డిఎ కూటమి తరుపున టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. స్థానిక తన నివాసంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో సరైన పాలనా వ్యవస్థ లేదని ఎన్నికల సంఘం ప్రత్యేక పరిశీలకులు రామ్మోహన్ మిశ్రా, దీపక్ మిశ్రాలు ఇచ్చిన నివేదికలతో జగన్ ప్రభుత్వం, అతడి ప్రధాన కార్యదర్శి, పోలీస్ యంత్రాంగం తలలు ఎక్కడ పెట్టుకుంటారని అన్నారు. ఎన్నికల సందర్భంలోనే ఇలా వ్యవహరించారంటే ఇక సాధారణ రోజుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజల దైన్యం ఏమిటో ఇప్పుడు అందరికీ అర్థమవుతోందని అన్నారు. పరిశీలకుల నివేదికలు, ఎన్నికల హింసపై కేంద్ర ఎన్నికల సంఘం నుంచి రాష్ట్ర డీజీపీ, ప్రధాన కార్యదర్శిలకు సమన్ల నేపథ్యంలో బుధవారం ఈసీ ఒక ప్రత్యేక ప్రకటన విడుదల చేశారన్నారు. ఈ సందర్భంగానే ఆయన రాష్ట్రంలో పాలనా యంత్రాంగం పూర్తిగా గాడి తప్పిందని, శాంతిభద్రతలను గాలికి వదిలేశారని తాము చేస్తున్న ఫిర్యాదులకు ప్రస్తుత ఈసీ పరిశీలకుల నివేదికలే మరో తిరుగులేని సాక్ష్యమని చెప్పారు. పల్నాడు సహా రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ రోజున అనంతరం చెలరేగిన హింసకు బాధ్యులైన వారు అందరు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర డీజీపీ, ప్రధాన కార్యదర్శులకు కేంద్ర ఎన్నికల సంఘం సమన్లను స్వాగతిస్తున్నామన్న ఆయన ఇప్పుడు ఈసీ తీసుకునే చర్యలు భవిష్యత్‌లో కూడా అందరికీ ఒక హెచ్చరికగా ఉండాలని అన్నారు. పోలింగ్ ముగిసి రోజులు గడుస్తున్నా హింసాగ్ని చల్లారక పోవడానికి వైసిపి కుట్రలు, క్షేత్రస్థాయి యంత్రాంగం వారి చేతుల్లో కీలుబొమ్మలుగా మారవడం వల్లనేనని విమర్శించారు. ముఖ్యంగా పల్నాడులో హింసకు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరులు, కాసు మహేశ్‌రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు పాత్రలపై అనేక ఆధారాలున్నా తొలుత పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించారన్నారు.

పోలింగ్ ముగిసినా చల్లారని రాజకీయ వేడి

- వరస దాడులు, ఘర్షణలతో బెంబేలెత్తుతున్న ప్రజలు
- పలు నియోజకవర్గాల్లో 144 సెక్షన్ అమలు
- మూడ్రోజులపాటు వ్యాపారాలు బంద్

పిడుగురాళ్లలో మూతబడ్డ దుకాణాలు

దాడిలో గాయపడిన దాచేపల్లి మండలం మాదినపాడుకు చెందిన ఆదిరెడ్డి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసినా గురజాల నియోజకవర్గంలో రాజకీయం మాత్రం రోజురోజుకి వేడెక్కుతుంది. ఎన్నికల రోజు ప్రారంభమైన గొడవలు దావానంలా నియోజకవర్గం మెత్తం వ్యాపిస్తున్నాయి. మునుపెన్నడూ చూడని విధంగా నియోజకవర్గంలో దాడులు జరుగుతుంటే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడేం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు.

గత ఎన్నికల్లో గురజాల నియోజకవర్గంలో 79 వాతం పోలింగ్ నమోదవ్వగా ఈసారి 83 శాతానికి పెరిగింది. నూతనంగా ఏర్పాటైన పల్నాడు జిల్లాలో అత్యధిక పోలింగ్ శాతం గురజాల నియెజకవర్గంలో జరిగినట్లు అధికారులు తెలిపారు. అయితే పోలింగ్‌తోపాటు ఘర్షణలు కూడా గతంలో కంటే ఎక్కువుగా పెరగడం ప్రజల్ని కలవరపెడుతోంది. పోలింగ్ రోజున దాచేపల్లి మండలంలోని నడికుడి, కేశానుపల్లి, ఇరికేపల్లి, తంగెడ, దాచేపల్లి పట్టణం తదితర ప్రాంతాల్లో ఘర్షణలు జరిగాయి. పిడుగురాళ్ల మండలంలోని జానపాడులో స్వల్ప వివాదాలు తలెత్తాయి. బ్రహ్మణపల్లిలో వైసిపి సర్పంచ్ మాబు కారును టిడిపికి చెందినవారు ధ్వంసం చేసి నిప్పంటించారు. మాచవరం మండలం వేమవరంలో చిన్నపాటి వివాదాలు జరిగాయి. కొత్తగణేశునిపాడులో పోలింగ్ రోజైన సోమవారం రాత్రి వైసిపి సానుభూతిపరులైన బీసీ సామాజిక తరగతికి చెందిన కుటుంబాలపై టిడిపికి చెందిన పెత్తందారీ సామాజిక తరగతివారు దాడులకు తెగబడ్డారు. బీసీ ఇళ్లపై 100 మందికి పైగా పెత్తందార్లు కర్రలు, ఇనుప రాడ్లతో దాడులు చేసి దమనకాండకు పూనుకున్నారు. దీంతో బాధితులంతా మహిళలు, వృద్ధులు, చిన్నారులను వెంటబట్టుకొని ప్రాణభయంతో ఇళ్లు వదిలి ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని పొలాల వెంట పారిపోయారు. మరికొందరు గ్రామ శివారులోని గంగమ్మ దేవాలయంలోనే తలదాచుకున్నారు. ఎవరు వచ్చి దాడి చేస్తారో అని రాత్రంతా బిక్కుబిక్కుమంటూ బతికారు. మంగళవారం ఉదయం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేశ్‌రెడ్డి, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్ గ్రామానికి వచ్చారు. భాదితులను పరామిర్శించేందుకు వారు పదులు సంఖ్యలో కార్లతో రావడంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరు గ్రూపులు దాడులు చేసుకునేందుకు కవ్విపు చర్యలకు పాల్పడ్డారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకుని ఇరు పక్షాలకు సర్దిచెప్పారు. అనంతరం గ్రామం నుండి బయలుదేరిన వైసిపి కాన్వాయిపై టిడిపి శ్రేణులు నాయకులు రాళ్ల దాడి చేశారు. ఇదిలా ఉండగా వైసిపి మాచవరం మండల అధ్యక్షులు చౌదరి సింగరయ్య, మరో నాయకుడు దారం లచ్చిరెడ్డిపై మంగళవారం రాత్రి సమయంలో కర్రలతో రాళ్ళతో దాడి చేయగా వారు తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరి కాళ్ళ, చేతులు విరిగడంతో వారిని పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. బుధవారం ఉదయం దాచేపల్లి మండలంలోని మాదినపాడులో వైసిపికి చెందిన ఆదిరెడ్డిపై టిడిపికి చెందిన వ్యక్తులు దాడి చేయడంతో ఆదిరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. రోజురోజుకూ దాడులు పెరుగుతుండటంతో జిల్లా పోలీస్ అధికారులు గురజాల నియోజకవర్గంలో 144సెక్షన్ అమలు చేశారు. నియెజకవర్గంలో మూడ్రోజులపాటు వ్యాపారాలు నిలిపివేయాలని దుకాణదార్లను ఆదేశించారు. నియోజకవర్గంలో పరిస్థితి అదుపులోకి తెచ్చేందుకు ప్రత్యేక బలగాలతో గస్తీ నిర్వహిస్తున్నారు.

హింసకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

హింసకాండకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సిఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలో 144వ సెక్షన్ విధించినట్లు బుధవారం సిఐ తెలిపారు. ఎన్నికల అనంతరం జరుగుతున్న అల్లర్ల నేపథ్యంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. సత్తెనపల్లి పట్టణంలో మూడ్రోజుల పాటు దుకాణాలు మూసివేయాలని వ్యాపార వర్గాలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు. అసాంఘిక చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్తెనపల్లి పట్టణంలో నలుగురు కంటే ఎక్కువ గుమ్మిగూడితే చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులు దగ్గరుండి దుకాణాలు ముయించారు. దీంతో సత్తెనపల్లి పట్టణంలో కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. దుకాణాలు మూసివేతతో నిత్యం రద్దీగా ఉండే వ్యాపార కూడళ్ల వెలవెలబోతున్నాయి.

రాజకీయ అల్లర్లు.. చిరువ్యాపారులకు ఇక్కట్లు

ప్రజాశక్తి - మాచర్ల

ఎన్నికల సందర్భంగా మాచర్ల పట్టణంలో చోటుచేసుకున్న అల్లర్ల నేపథ్యంలో పోలీసులు వ్యాపార సముదాయాలను మూసివేయంచటంతో చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు గురిఅవుతున్నారు. పట్టణంలో రోడ్డు పక్కన నెట్టుడు బండ్లపై వ్యాపారాలు చేసుకొనేవారి వందల సంఖ్యలో ఉంటారు. పూలు, కూరగాయాలు, టిఫెన్ సెంటర్లను నడుకునేవారు. అకస్మాత్తుగా వ్యాపారాలు నిలిపివేయటంతో సరుకు పాడవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరటి, మామిడి, కూరగాలయల వంటి పచ్చి సరుకు అమ్ముకునేవారు రెండు రోజులు నిల్వవుండే పండ్లు పాడవుతాయని ఆవేదన చెందుతున్నారు. కూరగాయల మార్కెట్ కూడా బుధవారం, గురువారం తీయవద్దని పోలీసులు చెప్పటంతో నిల్వవున్న సరుకు పాడవుతుందని, ఏ రోజుకారోజు వచ్చే ఆదాయంపై బతికే వారికి తీవ్ర నష్టమని వాపోతున్నారు.

సత్తెనపల్లిలో మూతబడ్డ దుకాణాలు

మాచర్లలో మూతబడ్డ దుకాణాలు

పెదకూరపాడులో అత్యధిక పోలింగ్

ప్రజాశక్తి - పెదకూరపాడు

పెదకూరపాడు నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్, హోమ్ ఓటింగ్ తో కలిపి మొత్తం పోలింగ్ శాతం 90.21 నమోదైంది. పల్నాడు జిల్లాలో అత్యధికంగా ఓట్లు పోలైంది పెదకూరపాడులోనే. 2019లో ఇక్కడ 88 శాతం ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గం మొత్తం రెండు లక్షల 32 వేల 453 ఓటర్లు ఉండగా వీరిలో రెండు లక్షల ఏడు వేల 307 మంది పోలింగ్ రోజుల ఇవిఎంల ద్వారా ఓటేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ 2187 మంది, హోం ఓటింగ్ 195 మంది ఓటేశారు. నియోజకవర్గంలో మొత్తం పోలింగ్ కేంద్రాలు 26 ఉండగా 149 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. వీటిల్లో 90 శాతం పైగా ఓట్లు పోలయ్యాయి. 21 పోలింగ్ కేంద్రాల్లో 95 శాతం కంటే ఎక్కువ ఓట్లు నమోదయ్యాయి. అమరావతి మండలంలోని నెమలికల్లు 97.98, మల్లాదిలో రెండు పోలింగ్ కేంద్రాలు 97.05 శాతం, 96.25 శాతం, లింగాపురం 95.97, అచ్చంపేట మండలంలోని కంచుబోడు తండా97.64 శాతం, చల్లగరిక 96.10 శాతం, ఓరవగల్లు 95.86 శాతం, అంబడిపూడి 95.59 శాతం, గింజుపల్లి 95.01 శాతం, కొత్తపల్లి 95.09 శాతం, క్రోసూరు మండలంలోని పారుపల్లి 97.45 శాతం, అందుకూరు 96.23 శాతం, నాగారం 96.12 శాతం, గరికపాడు 95.67 శాతం, నాగవరం 95.55 శాతం, వుయ్యందన 95.52 శాతం, బెల్లంకొండ మండలంలోని వన్నాయపాలెం 95.37 శాతం, పెదకూరపాడు మండలంలోని లింగంగుంట్ల 97.07 శాతం, తమ్మవరం 95.84 శాతం, పాటిబండ్ల 95.24 శాతం, కన్నెగండ్ల 95.04 శాతం చొప్పున ఓట్లు పోలయ్యాయి. అమరావతి మండలంలోని నెమలికల్లు గ్రామంలోని 263 పోలింగ్ కేంద్రంలో 97.98 శాతంతో నియోజకవర్గంలో అత్యధికంగా ఓట్లు పోలయ్యాయి. ఆ గ్రామంలోని 262 కేంద్రంలో 92.91 శాతం 261 పోలింగ్ కేంద్రంలో 91.14 శాతం ఓటింగ్ నమోదైంది. అత్యల్పంగా అమరావతిలోని ఏడు పోలింగ్ కేంద్రాల్లో 75 శాతం కంటే తక్కువ పోలయ్యాయి. అమరావతిలోని 227 పోలింగ్ కేంద్రంలో 73.86 శాతం మాత్రమే ఓట్లు నమోదయ్యాయి. ఇది నియోజకవర్గంలోని అత్యల్ప ఓట్లు పోలైన కేంద్రం.

నేడు అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్

ప్రజాశక్తి-గుంటూరు

సమావేశంలో మాట్లాడుతూ డిఎంహెచ్ఒ

క్షయ వ్యాధి నిర్మూలనకు నేడు 18 సంవత్సరాలు నిండిన వారందరికీ అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి తెలిపారు. బుధవారం డిఎంహెచ్ఒ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2025 నాటికి క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా ప్రతి గురువారం, సచివాలయాల్లో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, యంయల్‌హెచ్‌పిలు, అంగన్‌వాడీల ద్వారా ఈ వ్యాక్సినేషన్ చేపడుతున్నా మన్నారు. సమావేశంలో రాష్ట్ర పరిశీలకులు, ఆర్‌బిఎస్‌కె స్టేట్ మోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ టీబీ విన్ పోర్టల్‌లో నమోదైన గత ఐదు సంవత్సరాలుగా టీబీ వ్యాధితో బాధపడుతున్న వారు, టీబి వ్యాధిగ్రస్తుల దగ్గరి కుటుంబ సభ్యులు, 60 సంవత్సరాలు పైబడినవారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, ధూమపానం చేసేవారు, బాడీమాస్ ఇండెక్స్ 18 కన్నా తక్కువ ఉన్నవారందరికీ బీసీజీ టీకా ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ కె.వి సుబ్బరాజు మాట్లాడుతూ, అర్హులైన వారు అందరికీ ఈటీకాను అందజేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగంగా వైద్యాధికారులు, ఆరోగ్య కార్యకర్తలు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు.

నేడు జాతీయ డెంగీ దినోత్సవ ర్యాలీ

నేడు జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా పట్టణ ఆరోగ్య కేంద్రం ముత్యాలరెడ్డి నగర్‌లో డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీని ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నట్లు 'సమాజ భాగస్వామ్యంతో డెంగ్యూ వ్యాధిని నివారిద్దాం' అనే నినాదంతో, ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డెంగీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్లొగన్స్ ఇచ్చుకుంటూ ఈ ర్యాలీ పురవీధుల్లో తిరుగుతుందని, దోమల నివారణ చర్యలు ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్వో విజయలక్ష్మి

విస్తృతంగా ప్రచారం నిర్వహించాలి

ప్రజాశక్తి - తెనాలి

డెంగ్యూ వ్యాధిపై విస్తతంగా ప్రచారం నిర్వహించాలని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ కె విజయలక్ష్మి ఆదేశించారని, ఈనెల16న ప్రపంచ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా గుంటూరు డిఎంహెచ్ఓ కార్యాల యంలో బుధవారం మలేరియా విభాగంతో సమీక్ష నిర్వహించారని అసిస్టెంట్ మలేరియా అధికారి సిహెచ్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. జిల్లా మలేరియా అధికారి టి మురళీకష్ణ సుబ్బరాయణం తో పాటు తెనాలి మలేరియా సబ్ యూనిట్ బందం పాల్గొన్నట్లు తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో డెంగ్యూ సోకటానికి గల కారణాలు, నియంత్రణ చర్యలపై విస్తత ప్రచారం చేయాలని డిఎంహెచ్వో ఆదేశించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంఓ రాజు నాయక్, సబ్ యూనిట్ అధికారులు వి పున్నారెడ్డి, ఎస్ ఉమాకాంత్, సిబ్బంది ఎ బాలచంద్రమౌళి, శ్రీమన్నారాయణ, చంద్రశేఖర్, సాంబయ్య, శ్రీనివాసరావు, శివ గణేష్, వెంకటప్పయ్య, సుధీర్ పాల్గొన్నారు

బిజెపికి దేశవ్యాప్తంగా ప్రతికూల పవనాలు

వాసుదేవారెడ్డి సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మాట్లాడుతున్న ఈమని అప్పారావు

బిజెపికి దేశవ్యాప్తంగా ప్రతికూల పవనాలు వీస్తున్నా యని ఈ ఎన్నికల్లో అర్థమవుతున్నదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు పేర్కొన్నారు. మండలం లోని కాజా గ్రామంలో మంగళగవారం రాత్రి సిపిఎం నాయకులు సింహాద్రి వాసుదేవా రెడ్డి వర్ధంతి సభను సిపిఎం నాయకులు అప్పికట్ల ప్రకాశరావు అధ్యక్షతన నిర్వహించారు. తొలుత వాసు దేవా రెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈమని అప్పారావు మాట్లాడుతు నేడు కేంద్రం లోని బిజెపి ఈడి నీ అడ్డం పెట్టుకొని వారికి వ్యతిరేకంగా ఉన్నటువంటి వారందరినీ అరెస్ట్ లు చేయడం జరుగుతుందన్నారు. బిజెపి నీ ఎవరు వ్యతిరేకిస్తుంటే వారిని , ముఖ్య మంత్రులు ను సైతం అరెస్ట్ చేసి జైళ్ల లో పెడుతున్నారనీ ప్రజాస్వామ్యంలో ఇది తగునా అని ప్రశ్నించారు. రాష్ట్రం లోని టిడిపి, వైసిపి లు ప్రత్యక్షం గా, పరోక్షం గా బిజెపి కి వంత పాడుతున్నాయనీ.. ప్రమాదకరమైన బీజేపీనీ గమనించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల బాండ్ల కొనుగోలు కుంభ కోణం భారత దేశంలో అతి పెద్దదనీ, మరి అతి ఎక్కువ బాండ్ల కలిగిన బిజెపి నేతలను ఎందుకు జైళ్లలో పెట్టడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని నాశనం చేసింది మొట్ట మొదటిది బిజెపి, అటువంటి పార్టీకి రాష్ట్ర పార్టీలు మద్దతు ఎందుకు అని ప్రశ్నించారు. మత ఘర్షణలకు పాల్పడుతున్న బిజెపి సిఎఏ నీ రుద్దాలనీ చూస్తుందన్నారు. దేశం నష్ట పోతుంటే ప్రాంతీయ పార్టీల కు పట్టక పోవడం సిగ్గు చేటన్నారు. విశాఖ ఉక్కు ను అదానీకి అప్పనంగా అప్పగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనీ దానిపై మాట్లాడనీ పార్టీ లు ప్రజలను మభ్యపెడుతున్నాయన్నారు. కేరళ, తమిళనాడు, ఢిల్లీ పలు రాష్ట్రాల సిఎం లు ధైర్యంగా ఎదొర్కొంటుంటే రాష్ట్ర ప్రధాన పార్టీలు మాత్రం బిజెపికి దాసోహం కావడం సిగ్గు చేటన్నారు. గ్రామంలో పార్టీ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి. కోటేశ్వరి, ఎస్. కోటి రెడ్డి, తమ్మా ప్రసాద రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీకి ఎయిర్ కూలర్ బహూకరణ

ప్రజాశక్తి-గుంటూరు

బ్లాసమ్స్ చిల్డ్రన్ హాస్పిటల్ అధినేత డాక్టర్ యం.ఎన్.సుధీర్‌కుమార్‌రెడ్డి సౌజన్యంతో పల్నాడు బస్టాండ్‌లోని విజయవాడ నాన్‌స్టాప్ పాయింట్‌లో ఎయిర్ కూలర్ బహుకరించారు. ఈ కూలర్‌ను హాస్పిటల్ మేనేజర్లు కె.సురేష్, బి.మల్లిఖార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఆర్టీసి గుంటూరు-2 డిపో మేనేజర్ షేక్.అబ్దుల్ సలాం, ఎన్‌టిఆర్ బస్ స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ కె.సత్యనారాయణ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా షేక్ అబ్దుల్ సలాం బ్లాసమ్స్ చిల్డ్రన్స్ హాస్పిటల్ అధినేత డాక్టర్ యం.ఎన్.సుధీర్ కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కూలర్‌ను ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ అబ్దుల్ సలాం తదితరులు

వేసవి శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో తాడేపల్లి పట్టణంలోని అమరావతి ఐకాన్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం నుంచి వేసవి శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బాలోత్సవాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ వరకు లెక్కలు, డ్యాన్స్ విభాగాల్లో శిక్షణ ఉంటుందని చెప్పారు. ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు లెక్కలు, 11 నంచి 12.30 గంటల వరకు డ్యాన్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. డాక్టర్ ఎస్.లెనిన్‌బాబు, ప్రఖ్యాత డ్యాన్స్ మాస్టర్ చందు శిక్షణ ఇస్తారని తెలిపారు. 5, 6, 7 తరగులు జూనియర్స్, 8, 9, 10 తరగతులు సీనియర్స్‌గా శిక్షణ ఉంటుందని తెలిపారు. విద్యార్థులు తమకు నచ్చిన వాటిలో శిక్షణ పొందవచ్చని తెలిపారు. ఒక్కో విభాగానికి రూ.500 ఫీజు చెల్లించాలని

తెలిపారు. అపార్టుమెంట్ వాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వేసవిలో బాలబాలికలు సెల్‌ఫోన్ బానిసలు కాకుండా ఇటువంటి శిక్షణా తరగతులు ఉపయోగపడతాయన్నారు. బాలబాలికల్లోని ప్రతిభా పాఠవాలను వెలికితీయడానికి కూడా ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. ఎంటిఎంసి బాలోత్సవం ఆధ్వర్యంలో ఇప్పటికే ఉచిత ట్యూషన్ పాయింట్లతో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా బాలోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 42 విభాగాల్లో విద్యార్థులు తమ ప్రతిభా పాఠవాలను ప్రదర్శిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంటిఎంసి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, నిర్వాహకులు కల్యాణి, జి.రమ్య, సంధ్యారాణి, ఐజాక్ నూటన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిన్నమనేని మురళీకృష్ణ

18న పవర్‌లిఫ్టింగ్ జిల్లా ఎంపికలు

ప్రజాశక్తి - మంగళగిరి

గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన గుంటూరు జిల్లా సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ మెన్ అండ్ ఉమెన్ మాస్టర్స్ ఎక్యూప్డ్ విచ్ ప్రెస్ సెలక్షన్ పోటీలు మంగళగిరి పట్టణంలోని మాస్టర్ జిమ్ సెంటర్లో జరుగుతాయని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కే విజయభాస్కరరావు, షేక్ సందాని బుధవారం ఒక ప్రకటన తెలిపారు. పాల్గొని క్రీడాకారులు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు. పోటీలలో సెలెక్ట్ అయిన టీం ఈనెల 29వ తేదీ నుంచి 31 వరకు మంగళగిరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పాల్గొంటారని తెలిపారు.

పేదలకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-తెనాలి రూరల్

నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న సిని దర్శకుడు దిలీప్ రాజా

కొలకలూరు కాల్వ కట్లపై నివసిస్తున్న నిరుపేద యానాదులకు ట్రైబల్స్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు అంజలి రావూరి నిత్యవసరాలు పంపిణీ చేశారు. బుధవారం సినీ దర్శకుడు దిలీప్ రాజా ఆధ్వర్యంలో నిర్వహించిన నిత్యావసరాలు పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వేసవి అనంతరం పాఠశాలకు వెళ్ళనున్న చిన్నారులకు పుస్తకాలతో పాటు నిత్యావసరాలు అందజేసినట్లు అంజలి తెలిపారు. కొలకలూరు, నందివెలుగు ప్రాంతాల్లో పొలంగట్లపై జీవిస్తున్న యానాదులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశామన్నారు. చెట్ల క్రింద, పుట్టలు ప్రక్కన నివసిస్తున్న నిరుపేదలకు శాశ్వత ప్రాతిపదికన పక్కా గృహాలు నిర్మించాలని సిని దర్శకుడు దిలీప్ రాజా ప్రభుత్వాన్ని కోరారు. అర్హత ఉన్న యానాదులు అందరికీ రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరు చేసే దిశగా అధికారులు చర్య తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యలవర్రు గ్రామ మాజీ సర్పంచ్ ఇంటూరి విజయ్ భాస్కర్, సిని సహాయ దర్శకుడు వెంకీ రావణ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లక్ష్మణరెడ్డి

మనసును శక్తివంతంగా మార్చుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులను అవగాహన చేసుకుని, ఆకళింపు చేసుకుంటూ మనసును శక్తివంతంగా మార్చుకోవడం ద్వారానే మానవుడు మహామనిషిగా రూపొందుతాడని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక రామన్నపేట జనచైతన్య వేదిక హాల్లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 'మనసును శక్తివంతంగా మార్చుకోవడం ఎలా' అనే అంశంపై రెండు రోజుల ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని లక్ష్మణ రెడ్డి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ముగ్గురు నిరక్షరాస్యులు, పేదలు, నిరుద్యోగులలో ఒకరు భారతీయులుగా ఉండడం బాధాకరమన్నారు. 10శాతం ధనవంతుల చేతుల్లో 50శాతం సంపద కేంద్రీకతమై ఉందన్నారు. అట్టడుగున ఉన్న 50 శాతం ప్రజల చేతుల్లో 10 శాతం సంపద కూడా ఉండట్లేదాన్నరు. ఆర్థిక అసమానతలను తగ్గించడం ద్వారానే మానసిక ప్రశాంతత సమాజంలో లభిస్తుందన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ యోగా గురువు వెంకటేష్ గురూజీ ప్రసంగిస్తూ మనసును ఏకాగ్రతగా ఉంచుకోగలిగితే విజయాలను, లక్ష్యాలను, గమ్యాలను సాధించుకోగలుగుతామని సోదాహరణంగా వివరించారు.కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, ప్రెసిడెంట్ పి.విమల కుమారి, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, స్టెప్ అధ్యక్షులు కష్ణయ్య, సెంటర్ ఫర్ సోషల్ సైకాలజీ ఫౌండర్ ప్రొఫెసర్ నూతలపాటి అరవింద్ ప్రసంగించారు.

ప్రయివేటు టీచర్లకు అడ్మిషన్ కష్టాలు

- కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థల్లో వేధింపులు
- రోజూ ఒక అడ్మిషన్ ఇస్తేనే వేతనం
- చేర్పించకపోతే ఉద్యోగానికే ఎసరు
- అమలు కానీ జిఓ ఎం.ఎస్ 1

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

'మీ పిల్లలను మా స్కూల్లో చేర్పించండి', 'మీ పిల్లల్ని చేర్పించకుంటే మీ ద్వారా ఎవరైనా ఉంటే చెప్పండి సార్.. ప్లీజ్ కనీసం 10 మందిని చేర్చాలని యాజమాన్యం నిబంధన పెట్టింది. అడ్మిషన్లు చేయకపోతే మాకు వేతనాలలో కోతలు విధిస్తారు. చెప్పిన మేరకు అడ్మిషన్లలో కనీసం సగం అయినా చేయకపోతే ఉద్యోగం నుంచి తీసేస్తారు. ఇది ప్రయివేటు, కార్పోరేట్ పాఠశాలల అధ్యాపకుల దీన స్థితి.

ఇది పట్టణాల్లో, గ్రామాలలో ప్రైవేటు టీచర్లు ఇంటింటికి తిరుగుతూ తల్లిదండ్రుల ముందు ప్రాధేయ పడుతున్నారు. నరసరావుపేట పట్టణంలోని కార్పొరేట్, ప్రయివేటు పాఠ శాలలు, కళాశాలల్లో కొన్ని మినహా మిగిలిన విద్యా సంస్థల యాజమాన్యాలు టీచర్లు, అధ్యాపకులకు కనీస అడ్మిషన్లు టార్గెట్ పెట్టాయి. ఏళ్ల తరబడి ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్నప్పటికీ వేతనాలు పెంచడం లేదు కానీ, ప్రతి ఏడాది రెట్టింపు అడ్మిషన్లు మాత్రం చేయాలని నిబం ధనలు విధిస్తున్నారు. వేధింపులు తట్టుకోలేని పలువురు ఉద్యోగులు వారి ఉద్యో గాలను వదిలేస్తున్నారు.

ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అడ్మిషన్ల పేరిట బోధనా సిబ్బందిని వేధిస్తున్నారు. అధ్యాపకులే కాదు పాఠశాలల్లో వివిధ విభాగాలలో పని చేస్తున్న అధ్యాపకేతర సిబ్బందిని సైతం టార్గెట్లు పెట్టి మరీ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. టార్గెట్ పూర్తి కాని పక్షంలో వారిని ఉద్యోగాల నుండి తొలగించేస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో పలువురు మహిళా అధ్యాపకులు సైతం మండు టెండను సైతం లెక్క చేయకుండా గ్రామాల్లో, పట్టణాలలో ఇంటింటికి తిరు గుతూ పడరాని పాట్లు పడుతున్నారు. పల్నాడు జిల్లాలో 250 కి పైగా ప్రయి వేటు, కార్పొరేట్ పాఠశాలలు, 45 కి పైగా జూనియర్ కళాశాలుల ఉన్నాయి. వీటిలో సుమారు 15 వేల మందికి పైగా అధ్యా పకులు పనిచేస్తున్నారు. వీరిలో అధిక శాతం మహిళలు ఉండడం గమనార్హం. ప్రధానంగా కార్పొరేట్ ప్రయివేటు స్కూళ్ల అడ్మిషన్లు చేయిస్తేనే ఉద్యోగం ఉంటుందని బెదిరిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలను పాటించాలని ఎవరైనా అడిగితే ఆ మరుసటి రోజు నుంచే వారిని ఉద్యోగం నుంచి తొలగిస్తున్నారు.

చాలీచాలని వేతనాలను, అదీ కూడా సక్రమంగా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వేతనంతో కూడిన సెలవులు కూడా మంజూరు చేయడం లేదు. జి.ఓ ఎం.ఎస్ నెం.1 ప్రకారం ప్రయివేటు విద్యాసంస్థలో వసూలు చేసే ఫీజ్‌లో కనీసం 50 శాతం సిబ్బంది వేతనాల కోసమే ఖర్చు చేయాలి. కానీ ఎక్కడా ఆ నిబంధన అమలు జరగడంలేదు. కొన్ని చోట్ల పిఎఫ్ సౌకర్యం కల్పిస్తున్నా, యాజమాన్య కోటా మాత్రం చెల్లించకుండా మొత్తం ఉద్యోగి వేతనం నుండే పిఎఫ్ లో జమ చేస్తున్నారు. ఆయా విద్యా సంస్థల్లోని విద్యార్థుల తల్లిదండ్రులు ఉద్యోగస్తులై ఒకవేళ వారికి బదిలీ అయితే, బదిలీ అయిన చోట ఉన్న సదరు విద్యా సంస్థ బ్రాంచ్‌కు ఆ విద్యా ర్థులకు బదిలీ సౌకర్యం కల్పిస్తామని కార్పొరేట్ స్కూల్ సిబ్బంది చెబుతున్నారు. విద్యార్థులను పాఠశాలలో చేర్పించుకొని అడ్మిషన్ ఫీజు కట్టించుకునే వరకూ కేవలం పాఠశాల ఫీజు మాత్రమేనని చెబుతారు. ఫీజు చెల్లించిన తర్వాత బస్సు, యూనిఫామ్, బుక్స్ ఫీజు అంటూ ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలలు నిర్దేశించిన ఫీజులు చెల్లించాలని చెబుతున్నారు. దీంతో ముందుగా అడ్మిషన్లు కోసం తిరిగి పిల్లలను చేర్చిన ఉపాధ్యాయులపై విద్యార్థుల తల్లిదండ్రుల ఒత్తిడి పెరుగు తుండడంతో మరిన్ని సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై జిల్లా విద్యా శాఖ దృష్టి సారించి, ఉపాధ్యాయులపై వేధింపులు నిరోధించేలా చర్యలు తీసుకోవాలి.

తాగునీటి సరఫరా సక్రమంగా లేదు .. చెత్త కుప్పలూ తొలగించట్లేదు

ప్రజాశక్తి - మాచర్ల

మున్సిపల్ అధికారుల పనితీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజు మార్చి రోజు ఇచ్చే తాగునీటిని మూడు రోజులకు ఒకసారి ఇవ్వడంపై ప్రజలు మండి పడుతున్నారు. పట్టణంలోని వీధుల్లోని చెత్తకుప్పలను కూడా ప్రతి రోజు తొలగించే విష యమై అధికారులు అశ్రద్ధ తగదని ప్రజలు అంటు న్నారు. ఈ రెండూ అత్యవసర సేవలని, వీటిపై కూడా ప్రత్యేక శ్రద్ధ కనబరచకపోవడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తాగునీటి సరఫరాను మెరుగు పరచాలని, ఈ విషయమై సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉండే చెత్త కుప్ప లను కూడా ప్రతిరోజూ తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

గన్నమనేని వెంకయ్య మరణం తీరని లోటు

టిడిపి నాయకులు జివి ఆంజనేయులు

ప్రజాశక్తి- వినుకొండ

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గన్నమనేని వెంకయ్య మరణం పార్టీపరంగా, వ్యక్తిగతంగా తమకు తీరని లోటని టిడిపి నాయకులు జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక తారకరామనగర్‌లోని గ్రీన్ పార్క్ అపార్ట్‌మెంట్ వద్ద బుధవారం ఈపూరు మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు గన్నమనేని వెంకయ్య సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, భార్య లీలావతి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు. ఆంజ నేయులు మాట్లాడుతూ తనకున్న అత్యంత సన్నిహితుల్లో వెంకయ్య ఒకరని తెలిపారు. రాజకీయాల్లో సీనియర్‌గా ఉన్న ఆయన ఎప్పుడూ సలహాలు, సూచనలు ఇస్తూ పార్టీకి, తనకు అండగా ఉండే వారన్నారు. ప్రతి ఎన్ని కలకు ఆయన రాత్రింబవళ్లు కష్టపడి పనిచేశారన్నారు. 2019 ఎన్నికల్లో తాను ఓడిపోయినప్పుడు పార్టీ కార్యా లయంతో పాటు తన ఇంటికి తక్కువ మంది వచ్చే వారని, వెంకయ్య మాత్రం క్రమం తప్పకుండా రోజూ వచ్చేవారని చెప్పిన ఆంజనేయులు, ఆయనతో తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. రాష్ట్రంలో కూటమికి 135 సీట్లకుపైగా రాబోతున్నాయని, తాను ఎమ్మెల్యేగా గెలవబోతున్నానని జోస్యం చెప్పారు. కొండాయపాలెంలో వెంకయ్య గుర్తుండేలా మంచి

సంస్మరణ సభలో మాట్లాడుతున్న జివి ఆంజనేయులు

కార్యక్రమం చేయనున్నట్లు చెప్పారు. గన్నమనేని వెంకయ్య కుటుంబానికి వ్యక్తిగతంగా, పార్టీ పరంగా కూడా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మాట్లాడిన లీలావతి మాట్లాడుతూ పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే వారని, జీవీని ఎవరైనా ఒక్కమాట అన్నా ఎదిరించే వారిలో వెంకయ్య ముందు వరసలో ఉండేవారన్నారు. ఆయన కుటుంబానికి తామంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి వెంకయ్యతో మంచి సంబంధాలు ఉండేవని, తన వివాహం కూడా ఆయనే దగ్గరుండి జరి పించారన్నారు. తన తండ్రి అంటే వెంకయ్యకు అపరి మితమైన గౌరవం ఉండేదని నాటి రోజుల్ని గుర్తు చేసు కుని కంటతడి పెట్టారు. పార్టీలకు అతీతంగా వ్యక్తిగత సంబంధాలు దెబ్బతినకుండా వెంకయ్య అందరితో స్నేహంగా ఉండేవారని కొనియాడారు. తాను తెలుగుదేశంలో చేరేందుకు కూడా వెంకయ్య ఎక్కువ కృషి చేశారని తెలిపారు.

పోలీసులు అదుపులో నాయకులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్ :ఎన్నికల అనంతరం గ్రామాల్లో జరుగుతున్న అల్లర్ల నేప థ్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులను పోలీసులు అదుపు లోకి తీసుకున్నారు. సత్తెనపల్లి నియోజకవర్గం 12 మందిని పోలీ సులు గుర్తించి ఆయా పోలీసు స్టేషన్లకు తరలించారు. పల్నాడు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు గ్రామాల్లో గొడవలకు కారణమైన ముఖ్య నాయకులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో ఉన్న వైసిపి టిడిపి నాయకులను అదుపులోకి తీసు కున్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

పోలీసులతో టిడిపి కుమ్మక్కు అబద్ధం

అంబటి ఆరోపణపై టిడిపి ఖండన

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

పోలీసులు, టిడిపితో కుమ్మక్కయ్యారనేది వైకాపా అభ్యర్థి మంత్రి అంబటి రాంబాబు ఆరోపించడం శుద్ధ అబద్ధమని అన్నారు. సత్తెనపల్లి లో కన్నా లక్ష్మీనారాయణ గెలుపు ఖాయమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు అన్నారు. సత్తెనపల్లి కన్నా క్యాంపు కార్యాలయంలో టిడిపి నాయకులు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ అంబటి రాంబాబు తనకున్న ప్రభుత్వ సెక్యూరిటీతో, తన రౌడీలతో. చాగంటివారిపాలెం, లంకెలకూరపాడు గ్రామాల్లో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఆక్రమించి రిగ్గింగ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ విషయం తెలుసుకుని అక్కడికి వెళ్ళిన టిడిపి శ్రేణులపై మంత్రి తన అనుచరులతో, రౌడీ మూకలతో రాళ్ల దాడులు చేయించారని ఆరోపించారు. అంబటి ఓడిపోతారని, ఈ విషయాన్ని తట్టుకోలేని ఆయన ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. టిడిపి అధినేత చంద్రబాబును, కన్నా లక్ష్మీనారాయణను విమర్శించే హక్కు రాంబాబుకు లేదన్నారు. సమావేశంలో టిడిపి నేతలు పూజుల వెంకట కోటయ్య, బాపయ్య చౌదరి, అంచుల నరసింహారావు పాల్గొన్నారు.

డాక్టర్ లక్ష్మయ్య ఐఐటి, నీట్ అకాడమీ శిక్షణ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి- వినుకొండ

మార్కాపురం రోడ్డు లోని చెక్ పోస్ట్ సెంటర్‌లోని ఎస్ఎస్ఎల్ వి కాం ప్లెక్స్‌లో ఐఐటి, నీట్ శిక్షణా తరగతులను లక్ష్మయ్య స్టడీ సర్కిల్ వ్యవస్థాపకులు డాక్టరు పివి లక్ష్మయ్య బుధ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ వినుకొండ ప్రాంతం నుండి ఐఎఎస్, ఐపిఎస్, ఐఆర్ ఎస్, శిక్షణ తీసుకుని పోలీస్ అధి కారులుగా, కలెక్టర్లుగా, డాక్టర్లుగా, ఉన్నత ఉద్యోగాలు సాధిం చేందుకు శిక్షణా తరగతులు ప్రారంభించామన్నారు. విజయ వాడ, ఢిల్లీ వంటి మహా నగరాల్లో విద్య బోధనలో అపార అనుభవం గల అధ్యాపకులతో వినుకొండలోని తమ క్యాం పస్‌లో అధు నాతన, సాంకేతిక పరిజ్ఞానం,పరికరాలు విని యోగిస్తూ విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించి జీవితంలో అన్ని రంగాలలో విజయాలు సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని వినుకొండ పరిసర ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

. మాచర్లలో పోలింగ్ 83.75 శాతం

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల నియో జ క´ వ ర్గ ం లో సోమవారం జరిగిన పోలింగ్ 83.75 శాతంగా నమోదైంది. నియోజకవర్గ పరిధిలో పురుషులు 1,28,639కి గాను 1,08328 మంది తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. మహిళలు 1,33,743కి గాను 1,11,428 మంది తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. ఇతరులు 22కు గాను 10 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 2,62,404కు గాను 2,19,766 మంది తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. 2019 కంటే ఎక్కువ మంది సోమవారం ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019లో 79శాతం పోలింగ్ నమోదు కాగ, సోమవారం జరిగిన ఎన్నికలలో 83.75శాతంగా నమోదు అయినది. దూర ప్రాంతాల నుండి యువ ఓటర్లు ఎక్కువ మంది తరలిరావటంతో పోలింగ్ శాతం పెరిగినట్లు పలువురు తెలిపారు

గుండెపోటుతో గర్భిణి మృతి

ప్రజాశక్తి - క్రోసూరు

విజయలక్ష్మి

క్రోసూరుకు చెందిన నిండు గర్భిణి కాగితాల విజయలక్ష్మి (20) గుండెపోటుతో మంగళవారం రాత్రి మృతి చెందింది. ఆమెను ఆసుపత్రి తీసుకొని వెళ్లేలోపే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు ఒక కుమార్తె ఉంది. ఆమె మృతి వార్త విషయం తెలుసుకున్న పెదకూరపాడు నియోజక వర్గ ఉమ్మడి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ ఫోన్ ద్వారా ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. క్రోసూరు గ్రామపెద్దలు కాండ్రు కాశయ్య రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఎన్. కోటేశ్వర రావు, ఎం.శ్రీనివాసరావు, ఎం. రామాంజనేయులు, డి. యోహాను, కె.సాంబయ్య, ఎం.లక్ష్మి నారాయణ, షేక్ హసన్, డి.సాంబశివరావు, వెంకటేశ్వర్లు గౌడ్ లు పరామర్శించారు.

నేటి నుంచి కొలంకపురి నాటక కళాషత్ ఆహ్వాన నాటిక పోటీలు

ప్రజాశక్తి-తెనాలి

రూరల్ గ్రామం కొలకలూరు చిన్న రధశాల వద్ద కొలంకపురి నాటక కళాపరిషత్, హైదరాబాద్‌కు చెందిన వైకె నాటక కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 19వరకు దశమ ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కొలంకపురి నాటక కళాపరిషత్ అధ్యక్షులు గోపరాజు రమణ బుధవారం తెలిపారు. ప్రతిరోజు రాత్రి 6.30 గంటలకు నాటిక ప్రదర్శనలు ప్రారంభమౌతాయని, కార్యక్రమాల్లో భాగంగా సినీ, రంగస్థల నటులు డిఎస్ దీక్షిత్ స్మారక పురస్కారాన్ని ఈనెల 17న ప్రముఖ రంగస్థల నటులు ఎస్.రవీంద్రారెడ్డికి, అలాగే 18న వైకె నాగేశ్వరరావు స్మారక పురస్కారాన్ని భీమవంరకు చెందిన రధసారధి చైతన్య కళాభారతి అధ్యక్షులు రాయప్రోలు భగవాన్‌కు, జిఎల్ఎన్ మూర్తి స్మారక పురస్కారాన్ని తెనాలికి చెందిన సీనియర్ పాత్రికేయలు బిఎల్ నారాయణకు అందించనున్నట్లు తెలిపారు. తొలిరోజున రాత్రి ఏడు గంటలకు హైదరాబాద్ కళాంజలి వారి 'రైతేరాజు' సాంఘిక నాటిక, 8.45కు కాట్రపాడుకు చెందిన ఉషోదయా కళానికేతన్ వారి 'విముక్తి' నాటిక ప్రదర్శనలు ంటాయన్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా..?

అధ్వాన్నంగా వడ్డమాను - తుళ్లూరు రహదారి

ప్రజాశక్తి - తుళ్లూరు : అసలే గోతులు.. పైగా గోతుల్లోకి అడుగు లోతు వర్షం నీరు చేరడంతో వాహనదారులు హడలిపోతున్నారు. కనీసం మరమ్మతులు కూడా చేయక పోవడం తో ప్రయాణం కష్టాలు తప్పడం లేదని వాపోతున్నారు. తుళ్లూరు - వడ్డమాను, వడ్డమాను - పెదపరిమి రోడ్లు చాలా ఏళ్లుగా నిర్మాణానికి నోచుకోలేదు. కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. రోడ్లు ఇబ్బందికరంగా ఉన్నా తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణం చేయక తప్పడం లేదని, గుంతల కారణంగా వాహనాలు పాడై మరమ్మతులకు చాలా ఖర్చు చేయాల్చి వస్తోందని వాపోతున్నారు. వడ్డమాను, అనంతవరం, నెక్కల్లు, పెదపరిమి మీదుగా మంగళగిరి, వడ్డమాను - తుళ్లూరు రహదారులు ప్రాణసంకటంగా మారాయని ప్రజలు మండిపడుతున్నారు. వడ్డ మాను గ్రామం నుంచి మండల కేంద్రం తుళ్లూరుకు వివిధ వర్గాల ప్రజలు, విద్యార్థులు జెడ్పి హైస్కూల్‌కు నిత్యం ప్రయాణం చేస్తుంటారు. రోడ్డుఛిద్రం కావడంతో ప్రయాణం చేయడం ఇబ్బందికరంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. వడ్డమాను నుంచి మంగళగిరికి ఆటోలు, ద్విచక్ర వాహనాల పై ప్రతిరోజూ ఆయా గ్రామాల ప్రజలు ప్రయాణం చేస్తుంటారు. ఈ మార్గంలో ఆర్టీసీ బస్సులు కూడా నడుస్తున్నాయి. రోడ్డు అధ్వాన్నంగా ఉండడంతో ఈ మార్గంలో ప్రయాణం అంటే హడలిపోతున్నారు.ఎన్నికల కోడ్ అమలులోకి రావడానికి కొద్ది రోజులు ముందు వైసిపి సమన్వయ కమిటీ కన్వీనర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత వడ్డమాను- పెదపరిమి రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా రోడ్డు నిర్మాణానికి ఎలాంటి ఆటంకం కలగదని, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అయినప్పటికీ రోడ్డు నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని ఆయా గ్రామాల ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రోడ్ల నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరిధి విస్తృతం...ప్రమాదాలు అధికం

ప్రజాశక్తి-తెనాలి

రెవెన్యూ డివిజన్ హెడ్ క్వార్టర్ తెనాలి. ఆరు మండలాల పరిధికి ఒకే ఒక్క ఫైర్ స్టేషన్. అగ్నిప్రమాదాలూ మెండే. కాని మూడేళ్ళగా ఒకే ఒక్క అగ్నిమాపక వాహనం. ఇన్‌చార్జి అధికారి, సిబ్బంది కొరత షరామామూలే. వేసవిలో అగ్నిప్రమాద సమాచారం లేని రోజు ఉండదంటే అతిశయోక్తి కాదేమో. అలాగే ఒకే దఫా ఐదారు ప్రమాదాల సమాచారం కూడా సిబ్బందిని ఉక్కిరి బిక్కిరి చేసిన సందర్భాలు లేకపోలేదు. మరో వాహనం ఆవశ్యకత, అత్యవసర సర్వీస్ అని తెలిసినా తగు చర్యలు తీసుకోని ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతోంది. తెనాలి ఫైర్ స్టేషన్‌కు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

మూడేళ్లుగా ఒకే అగ్నిమాపక శకటం
ఆచరణకు నోచని వేమూరు ఫైర్ స్టేషన్ ప్రతిపాదన
అత్యవసర సర్వీసులకూ చొరవ చూపని ప్రజాప్రతినిధులు

తెనాలి ఫైర్ స్టేషన్ పరిధిలో తెనాలి, కొల్లిపర, కొల్లూరు మండలాలున్నాయి. వీటికితోడు దుగ్గిరాల, అమృతలూరు, చేబ్రోలు మండలాలు సగ భాగంకూడా తెనాలి అగ్నిమాపక శాఖ పరిధిలోవే. గతంలో ఇక్కడ రెండు అగ్నిమాపక వాహనాలుండేవి. అయితే ఒకటి మరమ్మతులకు గురికావటం, శిధిలావస్థకు చేరటంతో మరో వాహనం కోసం ఇక్కడి అధికారులు ప్రతిపాదించారు. కాని ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. ఫలితంగా మూడేళ్లుగా ఒకే ఒక్క వాహనంతో విధులు నిర్వహిస్తున్నారు. తెనాలి పరిధిలో వేసవిలో అగ్నిప్రమాదాలు గణనీయంగా జరుగు తుంటాయి. ఒకే రోజు ఒకే సమయంలో నాలుగైదు కాల్స్ వచ్చిన సందర్భం కూడా లేకపోలేదు. అలాంటి సమయంలో ఉన్న వాహనంతో సర్వీస్ అందించలేక సిబ్బంది సతమతమౌతున్నారు. స్థానిక శాసనసభ్యల దృష్టిలో సమస్య ఉన్నప్పటికీ వాహనాన్ని సమకూర్చేందుకు చర్యలు తీసుకోలేదన్న విమర్శ ఉంది. అత్యవసర సర్వీసులను అందుబాటులోకి తేకుండా ఫైర్ సేఫ్టీ పేరిట ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే మాత్రం ఉపయోగం

తెనాలి అగ్నిమాపక కేంద్రం, వాహనం

ఏముంటుందని ప్రజలంటున్నారు. ఇటీవలి కాలంలో బుర్రిపాలెం రోడ్డులోని డంపింగ్ యార్డులో మంటలు చెలరేగాయి. ఫైర్‌స్టేషన్‌కు సమాచారమిస్తే అదే సమయంలో మరోప్రాంతానికి వాహనం వెళ్ళింది. అదే సమయంలో వరుసగా నాలుగు చోట్ల ప్రమాదాలపై ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఉన్నట్లు తెలిసింది. దీంతో సకాలంలో అగ్నిమాపక వాహనం డంపింగ్ యార్డుకు చేరుకోలేకపోయింది. అయితే మున్సిపల్ అధికారులు స్పందించి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి మంటలను అదుపుచేశారు. ప్రమాదం జరిగిన ప్రాంతం డంపింగ్ యార్డు కాబట్టి సరిపోయింది. అదే గృహ సముదాయంలోనో, జనావాసాల మధ్య జరిగితే పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్ధకమే.

డంపింగ్ యార్డులో జరిగిన అగ్నిప్రమాదం(ఫైల్‌ఫోటో)

వేమూరు అగ్నిమాపక కేంద్రం ప్రతిపాదనలకే పరిమితం

ఉమ్మడి గుంటూరు నుంచి విడిపోయిన తరువాత కొల్లూరు, వేమూరు, అమృతలూరు, భట్టిప్రోలు, చుండూరు మండలాలు బాపట్ల జిల్లాలో చేరాయి. విభజనకు ముందు ఆ మండలాలు తెనాలి రెవిన్యూ డివిజన్‌లోవే. విభజన తరువాత కూడా ప్రస్తుతం తెనాలి అగ్నిమాపక శాఖ పరిధిలో కొల్లూరు మండలం, అమృతలూరు మండలం సగభాగం ఉన్నాయి. ఈ నేపధ్యంలో వేమూరు మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రానికి ఆ శాఖ అధికారులు ప్రతి పాదించారు. అయితే వాహనంతో పాటు సిబ్బందిని కూడా కేటాయించాల్సిన పరిస్థి తుల్లో ఆ ప్రయత్నం ముందుకు సాగలేదన్నది సమాచారం.

ఒక్క వాహనంతో కష్టమే..అయినా సమర్ధవంతంగానే ఎదుర్కొంటున్నాం

-కృష్ణారెడ్డి, ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్, తెనాలి

నేను గుంటూరు ఫైర్ ఆఫీసర్‌గా, తెనాలి ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్‌గా ఉన్నాను. తెనాలి కేంద్రానికి ఒకే వాహనం ఉంది. రెండోది అనివార్యం. స్టేషన్‌కు చుట్టూ 25కి.మి పరిధి ఉంది. దానిలో మంగళగిరి, అమృతలూరు, చేబ్రోలు మండలాలు సగభాగం చొప్పున. తెనాలి, కొల్లిపర, కొల్లూరు మండలాలు పూర్తిస్థాయిలో మా పరిధిలో ఉన్నాయి. వేసవిలో అగ్నిప్రమాదాలు ఎక్కువే. గత నెల్లో సాధారణ అగ్నిప్రమాదాలు 32 సంభవించాయి. వాటిలో గృహసంబందమైనవి మూడు, ఒక షాపు, వ్యవసాయ భూములకు సంబందించి 17, అవుట్ డోర్ స్టోరేజికి సంబందించి ఐదు, మరో ఆరు చిన్నాచితకా ప్రమాదాలున్నాయి. వాటిలో రూ.12.50లక్షల ఆస్థినష్టం సంభవించగా, రూ.25లక్షల విలువైన ఆస్తులను కాపాడగలిగాం. ఒకే దఫా మల్టిపుల్ కాల్స్ వచ్చినపుడు అటెండ్ కావటం ఇబ్బందిగానే ఉంది. వేమూరు ఫైర్ స్టేషన్ ప్రతిపాదనలు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. ఏదిఏమైనా మా శక్తి వంచనలేకుండా సాధ్యమైనంత వరకూ సేవలు అందిస్తున్నాం.

నియోజకవర్గ ఓటర్లకు టిడిపి ధన్యవాదాలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి నియోజకవర్గంలో ఉన్న ఓటర్లు ఈనెల 13వ తేదీన జరిగిన పోలింగ్లో ఎక్కువ శాతం పాల్గొని, ఓటు హక్కును వినియోగించుకున్న ఓటర్లకు టిడిపి, జనసేన పార్టీలు నాయకులు బుధవారం మంగళగిరి టిడిపి కార్యాలయంలో జరిగిన వీడియో సమావేశంలో ధన్యవాదాలు తెలిపారు. రాక్షసి పాలనపై ఓటర్లు తమ ఓటు ద్వారా తెలియజేశారని అన్నారు. మంగళగిరి నియోజకవర్గంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్ డి ఏ ఓటమి అధికారులకు వస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు నందం అబద్దయ్య, దామర్ల రాజు, టి జానకి దేవి, షేక్ రియాజ్, తోటా పార్ధసారథి, జనసేన నాయకులు మునగపాటి వెంకట మారుతీరావు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయంలో

అధికారుల్లేక ప్రజలు ఇక్కట్లు

ప్రజాశక్తి - తుళ్లూరు

బుధవారం మధ్యాహ్నం సమయం సరిగ్గా గం 12.30 లు..మండల పరిషత్ కార్యాలయంలో ఒక్క అధికారి కానీ, సిబ్బంది కానీ కనిపించలేదు. ఉదయం గం 10 గంటలకు రావాల్చిన అధికారులు,సిబ్బంది మధ్యాహ్నం వేళకు కూడా రాలేదు.ఎన్ ఆర్ ఈ జి ఎస్ అధికారులు మాత్రం హాజరయ్యారు.ఎంపిడివో గది తలుపులు కూడ మూసివేసి ఉండడం కనిపించింది. మిగతా అన్ని గదుల్లో ఖాళీ కుర్చీలు దర్శన మిచ్చాయి. తహశీల్దార్ కార్యాలయంలోనూ ఒకరిద్దరు సిబ్బంది మినహా అధికారులు కనిపించలేదు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయంకు వచ్చిన వారు ఒక్క అధికారి కూడా లేకపోవడం, కనీసం సమాధానం చెప్పేవారు కూడా కనిపించక పోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

బాధితులను పరామర్శించిన శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి-తాడికొండ

వైసీపీ దాడిలో గాయపడిని బాధితులను తెనాలి శ్రావణకుమార్ బుధవారం పరామర్శించారు. తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎన్నికల నేపథ్యంలో నిడుముక్కల గ్రామంలో టీడీపీ నాయకులపై జరిగిన దాడిలో గాయపడిని బాధితులను ఎన్డీఏ కూటమి అభ్యర్థి తెనాలి శ్రావణకుమార్, టీడీపీ నాయకులు పరామర్శించారు. నిడుముక్కల పంచాయతీ వార్డు మెంబరు గుజ్జర్లపూడి స్వరూప ఇంటిపైకి రాళ్లు రువ్వి, దాడి చేసి వస్తువులను ధ్వంసం చేసి మహిళ అని చూడకుండా ఆమెపై దాడి చేసారు. సోమవారం పోలింగ్ సమయంలో నెప్పల్లి కిషోర్‌పై దాడి చేసి గాయపరిచారు. దీంతో గ్రామంలో ఉద్రికత్త వాతావరణం నెలకొన్నది. ఈ సందర్భంగా శ్రావణ్ బాధితులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ శ్రేణులపై దాడులు చేయటం హేయమైన చర్య అన్నారు. బాధితులకు బాసటగా ఉంటామని పేర్కొన్నారు. బాధితులను పరామర్శించిన వారిలో సీనియర్ నాయకులు కంచర్ల శివరామయ్య, ఎడ్డూరి హనుమంతరావు, మండల పార్టీ అధ్యక్షులు తలశిల ప్రసన్నకుమార్, పిరంగపురం మండల అధ్యక్షులు మండవ నరసింహారావు, గడ్డిపాటి సాంబశివరావు, చిగురుపాటి అనూఫ్, ఎంపీటీసీ తాటి తులసీరామ్, తదితరులు ఉన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో మహిళలే అధికం

నియోజకవర్గంలో 76.16 శాతం పోలింగ్ నమోదు : ఆర్ఓ ప్రఖర్ జైన్

ప్రజాశక్తి - తెనాలి

వివరాలు వెల్లడిస్తున్న ఆర్వో ప్రఖర్ జైన్

నియోజకవర్గంలో 76.16శాతం పోలింగ్ నమోదు కాగా వారిలో మహిళలే అధిక శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారని రిటర్నింగ్ అధికారి ప్రఖర్ జైన్ బుధవారం తెలిపారు. మొత్తం 2,67,424 మంది ఓటర్లు ఉండగా వారిలో 2,03,832 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. వారిలో 99,368 మంది పురుషులు కాగా, 1,04,449 మంది మహిళలున్నారన్నారు. నియోజకవర్గంలో 273 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటిలో ఒకటి నుంచి 222 వరకు గల పోలింగ్ కేంద్రాలు తెనాలి పట్టణం, రూరల్ ప్రాంతాలలో ఉన్నాయని, 223 నుంచి 273 వరకు గల పోలింగ్ కేంద్రాలు కొల్లిపర మండలంలో ఉన్నాయన్నారు. బూత్ లు వారీగా పోలింగ్ శాతానికి పరిశీలిస్తే తెనాలి మండలంలో కాజీపేట నాలుగవ నెంబర్ పోలింగ్ బూత్ లో అత్యధికంగా 93.46శాతం, పట్టణంలోని డి ఇందిరా మున్సిపల్ బాలికోన్నత పాఠశాల 202 పోలింగ్ కేంద్రంలో అత్యల్పంగా 61.12శాతం పోలింగ్ నమోదయిందన్నారు. అలాగే కొల్లిపర మండలంలో సిరిపురం గ్రామం 230 పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 95.93శాతం, అత్యల్పంగా గుదిబండి వారి పాలెం 264 పోలింగ్ కేంద్రంలో 82.32 శాతం పోలింగ్ నమోదయిందన్నారు. మొత్తంగా ఓటర్లు ఎంతో చైతన్యంతో ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు.

1999-2000 బ్యాచ్ విద్యార్థులు కుటుంబ సభ్యులు ఉపాధ్యాయులు

15 ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆహ్లాదంతో నిండిపోయిన వి.రెడ్డిపాలెం జెడ్పి హైస్కూల్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రతి ఒక్కరి జీవితంలో గుర్తుండే తీపి జ్ఞాపకాలు చిన్నతనంలోనే ఉంటాయి. చదువుకునే రోజులు చేసే అల్లరి స్నేహితులతో గడిపే మధుర క్షణాలు కలిసి ఆడిన ఆటలు చిన్న చిన్న గ్యాంగ్ లు ఏర్పాటు చేయడం అవన్నీ ఓ మధురమైన క్షణాలు. మళ్లీ అవన్నీ గుర్తు చేసుకుంటూ ఏళ్ల తర్వాత కలుసుకుని ఆనందంగా గడిపారు రొంపిచర్ల మండలం వి.రెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999-2000 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు. అదే పాఠశాలలో బుధవారం కలిసి 15 ఏళ్ల నాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు ముందుగానే గ్రామాలకు చేరుకున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకుని మధుర జ్ఞాపకాలను తలుచుకుంటూ సంతోషంగా గడిపారు. వాట్సప్ వేదికగా గత కొన్ని నెలల నుండి మిత్రులందరూ ఒకరినొకరు పరిచయం చేసుకుని ఈ కార్యక్రమం నిర్వహించుకున్నారు. విద్యా బోధన చేసిన గురువులు రాము, ఖాన్, దుర్గాప్రసాద్, సత్యనారాయణ, జోగిరెడ్డి, రమేష్ బాబు, ఓబయ్య, వెంకటేశ్వరరావు, లక్కిరెడ్డి, రాజేశ్వరి, విజయభాస్కర్, ఇందిరలను ఘనంగా సత్కరించి పాదాభివందనం చేశారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమ లాంటి ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి, తీర్చిదిద్దిన గురువులను సన్మానించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పలువురు స్నేహితులకు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆత్మీయత సమ్మేళనంలో చిన్ననాటి మిత్రులు ఒకే వేదికపై కలుసుకోవడం చిన్ననాటి కబుర్లు చెప్పుకుంటూ స్నేహబంధం కలకాలం కొనసాగిద్దామని తీర్మానం చేసుకున్నారు.

అవగాహన ఆధ్వర్యంలో సర్ ఆర్థర్ కాటన్ జయంతి

ప్రజాశక్తి-గుంటూరు

కాటన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అవగాహన సభ్యులు

ఆంధ్రప్రదేశ్ దాన్యా గారం కావటానికి మూలపురుషునిగా, జీవన ప్రదాతగా సర్ ఆర్థర్ కాటన్ గోదావరి జిల్లాల ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాడని వక్తలు పేర్కొన్నారు. బుధవారం అరండల్‌పేటలోని అవ గాహన సంస్థ కార్యాల యంలో గోదావరి డెల్టా పితామహుడు ఆర్థర్‌కాటన్ జయంతి నిర్వహించారు. సీనియర్ ఇంజినీర్ ఎన్.సదాశివం మాట్లాడుతూ ఈరోజుకి సర్ అర్థర్ కాటన్ మహాశయుని ఇంగ్లీషు దేవునిగా గోదావరి ప్రాంతవాసులు ఆరాదిస్తారని, కాటన్ మహాశయుని పేరు చెబితే గోదావరి జిల్లాలు నిలువెత్తు పులకించిపోతాయని అన్నారు. గోదావరి ప్రాంత వాసులకు పట్టెడన్నం పెట్టిన మహాపురుషుడు కాటన్ అన్నారు. ఏపీ లీగల్ ఫోరం కన్వీనర్ అవధానుల హరి మాట్లాడుతూ కాటన్ ముఖ్యంగా కృషి చేసి విజయం సాధించిన ప్రాజెక్టులలో గోదావరిపై ధవళేశ్వరం ఆనకట్ట కాలువల నిర్మాణం మొదటిగా చెప్పుకోవచ్చన్నారు. ఈ కాల్వల విభజన, అన్ని ప్రాంతాలను కలుపుతూ సాగే విస్తరణ గోదావరి నదీ పరివాహక జిల్లాలను అత్యంత అభివృద్ధి, అధిక వ్యవసాయ దిగుబడులు గల జిల్లాలుగా మార్చాయన్నారు. కృష్ణా నదిపై ప్రకాశం బ్యారేజికి, తంజావూర్‌లో కోలెరూన్ నదీపై ఆనకట్టకు ఇతరత్రా బెంగాల్, ఒడిస్సా, బీహార్‌లో నదులను ప్రజలకు ఉపయోగపడేలా కాటన్ విశేష కృషి చేశాయన్నారు. కార్యక్రమంలో విశ్రాంత సింగరయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు పహారాలో మాచర్ల

పట్టణంలో కర్ఫ్యూ వాతావరణం - 144 సెక్షన్ అమలు

ప్రజాశక్తి - మాచర్ల

వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

మాచర్ల నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల అనంతరం జరిగిన అల్లర్ల నేపథ్యంలో మాచర్లలో ఎటువంటి దాడులు, ప్రతిదాడులు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా భారీ సంఖ్యలో పోలీస్ బలగాలు మంగళవారం రాత్రికే మాచర్ల చేరుకున్నాయి. నియోజక వర్గం లోని కారంపూడిలో మంగళవారం వైసిపి, టిడిపి పార్టీల మధ్య దాడులు, ప్రతిదాడులు జరిగిన నేపథ్యంలో మాచర్ల అల్లర్ల పై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర డిజిపికి ప్రత్యేకంగా ఫిర్యాదు చేశారు. కారంపూడి అల్లర్ల ప్రభావం మాచర్లపై పడు తుందని, నాయకుల ఇండ్లపై దాడులు జరిగే అవకాశం ఉండటంతో పోలీస్ బలగాలు మాచర్ల చేరుకున్నాయి. టిడిపి అభ్యర్థి జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఎన్నికల సంద ర్భంగా జరిగిన దాడుల్లో గాయపడి నర్సరావు పేటలో చికిత్స పొందుతున్న పార్టీ కార్యకర్తలను పరామర్శించటానికి వెళ్ళి తిరిగి వస్తుండగా కారంపూడిలో పెద్ద ఎత్తున అల్లర్లు జరగటంతో పోలీస్ ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా బ్రహ్మారెడ్డిని మాచర్ల రాకుండా వినుకొండలోనే నిలిపివేశారు. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిని హౌస్ అరెస్టులు చేశారు. మాచర్ల పట్టణంలోకి చుట్టుపక్కల గ్రామాల నుంచి వైసిపి, టిడిపి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు రాకుండా వాహనాలు తనిఖీ చేస్తున్నారు. పట్టణంలోని వ్యాపార సముదాయాలను మూసివేయింటంతో మాచర్ల కర్ఫ్యూ వాతావరణం కనపడుతుంది. 144 సెక్షన్ ఉండటంతో ఎక్కువమంది గుమిగూడి ఉన్న చోట పోలీసులు లాఠీలకు పని చెపు తున్నారు. మంగళవారం రాత్రికే మాచర్ల చేరు కున్న ఐజి త్రిపాఠి, ఎస్పి బింధు మాదవ్‌లు పట్ట ణంలో స్వయంగా పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

పెదకూరపాడులో 144 సెక్షన్

షాపులు మూసివేత - ఐదు కేసులు నమోదు

ప్రజాశక్తి - పెదకూరపాడు

పెదకూరపాడు మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉందని పెదకూరపాడు ఎస్ఐ వెంకట్రావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ముగ్గురు అంతకంటే ఎక్కువమంది ఒకచోట ఉంటే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మెడికల్ షాపులు మినహా మిగతా అన్ని షాపులు మూసివేయాలని కోరారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఐదు కేసులు నమోదైనట్లు వివరించారు. హుస్సేనగరం బలుసుపాడు, ఖమ్మంపాడు, పెదకూరపాడు, తాళ్లూరు గ్రామాలలో ఎన్నికల సందర్భంగా కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. తాళ్లూరులో ఎస్సీ ఎస్టీ కేసు తీసుకోవడం జరిగిందన్నారు.

గుంపులుగా, మారణాయుధాలతో తిరిగినా కఠిన చర్యలు : పల్నాడు ఎస్పి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేటలో దుకాణాలు మూయిస్తున్న పోలీసులు

ఎన్నికల సందర్భంగా పల్నాడు జిల్లాలో జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో పల్నాడు జిల్లాలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్పీ జి.బిందు మాధవ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా నరసరావుపేట పట్టణంలో డిఎస్పి వి.ఎస్.ఎన్ వర్మ ఆధ్వర్యంలో ప్రధాన కూడళ్లలో దుకాణాలు మూసి వేయించారు. ఎన్నికల సందర్భంగా ఇరు వర్గాలు ఆయా పార్టీల అభ్యర్థుల కార్లు ధ్వంసం చేయడం ఇళ్లపైకి దాడికి ప్రయత్నించడం తోపాటు రాళ్లు రువ్వుకోవడం కర్రలు, బీరు సీసాలు, పెట్రో బాంబులతో ఆయా పార్టీల వర్గీయులు భయానక వాతావరణ సృష్టించిన నేపథ్యంలో మళ్లీ ఇదే తరహా వివాదాలు జరిగేందుకు ఆస్కారం ఉందన్న అనుమానం నేపథ్యంలో పల్నాడు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. నరసరావుపేట టిడిపి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, గురజాల వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్ రెడ్డిని గృహ నిర్బంధం చేశారు. 144 సెక్షన్ ఎత్తివేస్తామని ప్రకటించే వరకు 144 సెక్షన్ అమలులో ఉన్నట్లేనని ఎస్పీ పేర్కొన్నారు. పల్నాడు జిల్లాలో ప్రశాంత వాతావరణ నెలకొల్పేందుకు పోలీసు శాఖ చేస్తున్న కృషికి ప్రజలంతా సహకరించాలని పోలీసు శాఖ విధించిన నిబంధన అతిక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎస్పీ హెచ్చరించారు ఈ మేరకు జిల్లావ్యాప్తంగా పట్టణాలతో పాటు గ్రామాలలో సైతం పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఎన్నికల రోజు పల్నాడు జిల్లాలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనకు సంబంధించి 20 కి పైగా కేసులు నమోదు చేశామని ఇరు పార్టీలకు చెందిన 62 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

ఎస్ఆర్ఎం స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్ గా లక్ష్మణ్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం స్టూడెంట్ కౌన్సిల్ నూతన ప్రెసిడెంట్‌గా కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ ఫైనలియర్ విద్యార్థి బీవీఎస్ లక్ష్మణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్ గా సీఎస్ఈ థర్డ్ ఇయర్ విద్యార్థిని నివేదా శ్రీరామ్ ఎంపికయ్యారు. బుధవారం సాయంత్రం యూనివర్సిటీ ఆడిటోరియంలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను నూతన కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. కౌన్సిల్ ప్రధాన కార్యదర్శిగా వేముల అంకిత్ రెడ్డి, కోశాధికారిగా రిషబ్ రంజన్లు ఎన్నికయ్యారు. ఏడాది కాలం పాటు కౌన్సిల్ కోర్ కమిటీ సభ్యులుగా వీరు నలుగురూ కొనసాగుతారు. ఇప్పటి వరకూ స్టూడెంట్ కౌన్సిల్ అధ్యక్షుడిగా కొనసాగిన ప్రీతమ్, నిరుక్తాలు నూతన కమిటీకి బాధ్యతల్ని అప్పగించారు. ఈ సందర్భంగా జరిగిన పరిచయ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరా, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్ కుమార్ లు ఇప్పటి వరకూ కౌన్సిల్ బాధ్యతల్ని నిర్వర్తించిన ప్రీతమ్, నిరుక్తా, సంజన బృందానికి జ్ఞాపికలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిల్ బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించిన కిందటేడాది సభ్యులకు వీసీ మనోజ్ కుమార్ ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కమ్యూనికేషన్స్ డైరెక్టర్ పంకజ్, సీఎఫ్ఏవో సుమ, డీన్ డాక్టర్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కౌన్సిల్ నూతన కమిటీ సభ్యులు లక్ష్మణ్, నివేదా. అంకిత్, రిషబ్